

దళితబంధు నిధులు విడుదల చేయాలి

హుజూరాబాద్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): దళితబంధు రెండో విడత నిధులు విడుదల చేయాలని కోరుతూ బీజేపీ ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయంలో ఎదుట మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆర్డీవో కార్యాల యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ దళితబంధు డబ్బులు రాకుండా అప్పట్లో కౌశిక్‌రెడ్డి అడ్డుకుంటే ఇప్పుడు కాంగ్రెస్ నాయకులు అదే పనిచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో తూర్పాటి రాజు, జి ప్రభాకర్, పి శ్రీనివాస్, సుమన్, శశిధర్, రాజు, వాసు, రమేష్, కొంరయ్య, సంపత్, చంద్రిక, వెంకటేష్, సందీప్, కొండాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉద్యాన పంటల సాగుతో రైతులకు లాభాలు

- జిల్లా ఉద్యాన అధికారి పల్లె కమలాకర్ రెడ్డి



మాట్లాడుతున్న జిల్లా ఉద్యాన అధికారి పల్లె కమలాకర్‌రెడ్డి

చొప్పదండి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఉద్యాన పంటల సాగుతో రైతులకు మంచి లాభాలు వస్తాయని ఉద్యాన శాఖ జిల్లా అధికారి పల్లె కమలాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం చొప్పదండిలో ఉద్యానశాఖ పథకాలపై జరిగిన రైతు అవగాహన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ఉద్యాన పంటల సాగుకు ప్రభుత్వం అనేక రాయితీలను ప్రకటించిందని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పండ్ల తోటలు, కూరగాయలు, పూల సాగు, యాంత్రిక పరికరాలకు, సూక్ష్మ నీటి సేద్యానికి, ఆయిల్ పాం సాగుకు నగదు రూపంలో రాయితీలు ఇచ్చి ప్రోత్సహించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరి మహేశ్, మండల వ్యవసాయాధికారి వంశీకృష్ణ, చొప్పదండి డివిజన్ ఉద్యాన అధికారి రోహిత్ చింతల, మండల ఏఈవోలు, ఫీల్డ్ ఆఫీసర్ వంశీ పాల్గొన్నారు.

భూముల విలువ పెంపు



- కసరత్తు చేస్తున్న అధికార యంత్రాంగం
- మార్కెట్ రేట్లకు అనుగుణంగా పెంచే యోచన
- ధరల సవరణకు ప్రతిపాదనలను సిద్ధంచేసిన జిల్లా అధికారులు
- పెరగనున్న వాణిజ్య, నివాస, వ్యవసాయ స్థలాల ధరలు

కరీంనగర్ క్రైం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా అర్బన్, రూరల్ ఏరియాల్లో భూములు, ఇళ్ల స్థలాల ధరలకు, రిజిస్ట్రేషన్ శాఖ మార్కెట్ విలువకు భారీ వ్యత్యాసం ఉంది. దీనిని సరిచేస్తూ స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఆదాయాన్ని పెంచుకోవాలని భావిస్తోంది. ఇందులో భాగంగా త్వరలోనే భూములు, ఇళ్ల స్థలాలు, ఇళ్లు, ప్లాట్ల ధరల విలువలను భారీగా పెంచాలని నిర్ణయిం చినట్లు సమాచారం. ఇప్పటి వరకు భూముల విలువల సవరణకు సంబంధించిన స్పష్టమైన మార్గదర్శకాలు ప్రభుత్వం విడుదల చేయలేదు. ప్రస్తుతం జిల్లాలో ఉన్న భూములు, ఇతర ఆస్తుల మార్కెట్ ధరలనుబట్టి ఏ మేరకు రేట్లను సవరించుకునే వీలుంటుందో సూచిస్తూ జిల్లా అధికారయంత్రాంగం ప్రభుత్వానికి నివేదిక సమర్పించినట్లు సమాచారం. రాష్ట్ర ఉన్నతాధికారులు జిల్లా నుంచి అందిన ప్రతిపాదనలను పరిశీలించి ఏ మేరకు మార్కెట్ విలువలను పెంచుతారనేది నిర్ణయించాల్సి ఉన్నది.

రిజిస్ట్రేషన్ ఫీజు తగ్గే అవకాశం

ఆదాయం సమకూర్చేందుకు ప్రభుత్వం భూముల మార్కెట్ విలువలను పెంచడంతోపాటు రిజిస్ట్రేషన్ ఫీజును 1.5 శాతం వరకు తగ్గించాలనే ప్రతిపాదన ఉందని సమాచారం. మహిళకు మాత్రమే స్టాంపు డ్యూటీ తగ్గించాలని ప్రభుత్వం యోచిస్తున్నది. రిజిస్ట్రేషన్లకు సంబంధించిన స్టాంపు డ్యూటీని తగ్గించి భూముల విలువలను పెంచితే ఎలాంట ఉంటుందనే అంశంపై స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులు విస్తృత కసరత్తులు చేస్తున్నారు. ఈ మేరకు ఇప్పటికే ప్రభుత్వానికి ఒక నివేదిక అందజేశారు.

భారీ వ్యత్యాసం

ప్రస్తుతం కరీంనగర్ అర్బన్ ప్రాంతాల్లో భూము లకు ప్రభుత్వం నిర్ణయించిన మార్కెట్ విలువ గజానికి అత్యల్పంగా 4,000 వేల నుంచి అత్యధికంగా 36,900 వేల వరకు ఉంది. అదే జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో గజానికి 700 నుంచి 4,100 రూపాయల వరకు విలువ ఉన్నది. బహిరంగ మార్కెట్‌లో దీని ధర చాలా రెట్లు ఉంటుంది. అర్బన్(టవర్‌సర్కిల్)లో బహిరంగ మార్కెట్‌లో గజం స్థలం ధర లక్ష రూపా యల వరకు ఉండగా, గ్రామాల్లో (కొత్తపల్లి) 25 వేల నుంచి 30 వేల వరకు ఉంది. ప్రభుత్వ నిర్ధారిత విలువలకన్నా అధిక మొత్తంలో భూములు, ఆస్తుల క్రయవిక్రయాలు జరుగుతున్నా 90 శాతం మంది ప్రభుత్వ నిర్ధారిత విలువకే రిజిస్ట్రేషన్లు చేసుకుంటున్నారు. మార్కెట్ విలువకన్నా చాలా తక్కువ ధరలు రిజిస్ట్రేషన్ విలువ ఉన్న కారణంగా బ్యాంక్ రుణాలు పొందడంలోనూ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కరీంనగర్‌లో భూముల ధరలకు రెక్కలువచ్చి అమాంతం పెరిగాయి. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో పరిసర గ్రామాలు విలీనంతోపాటు ఉమ్మడి జిల్లాలో చేపట్టిన సాగునీటి ప్రాజెకుల్లో భూములు కోల్పోయిన నిర్వాసితులు అధిక శాతం కరీంనగర్‌కు వచ్చి స్థిరపడ్డారు. మరో వైపు వ్యవసాయం ఊపందుకుంది. దీంతో వ్యవసాయ భూముల ధరలు కూడా విపరీతంగా పెరిగాయి. ఏడాదిన్నరగా రియల్‌ఎస్టేట్ పడిపోయి భూములు, ఇళ్ల స్థలాలు, ఇళ్ల అమ్మకాలు, కొనుగోళ్లు తగ్గాయి. దీంతో రిజిస్ట్రేషన్లు తగ్గిపోయి ప్రభుత్వానికి ఆదాయం తగ్గింది.

ప్రస్తుతం వసూలు చేస్తున్న ఫీజులు

ప్రస్తుతం సేల్‌డీడ్‌కు మార్కెట్ వాల్యూపై స్టాంపు డ్యూటీ 5.5 శాతం, ట్రాన్స్‌ఫర్ డ్యూటీ 1.5 శాతం,

(మిగతా 8వ పేజీలో)

కలెక్టర్ చైర్మన్‌గా మార్కెట్ వాల్యూ రివిజన్ కమిటీలు

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత మొదటిసారిగా 2021లో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలో మార్కెట్ విలువను 20 శాతం పెంచింది. 2022లో మళ్లీ 33 శాతం పెంచింది. అప్పటి నుంచి భూముల మార్కెట్ విలువను పెంచలేదు. రెండు సంవత్సరాలకు ఒకసారి భూములు, ఆస్తుల మార్కెట్ విలువలు పెంచేందుకు అవకాశం ఉంది. జిల్లాల్లో అర్బన్ ప్రాంతాల్లో కలెక్టర్ చైర్మన్‌గా అడిషనల్ కలెక్టర్, మున్సిపల్ కమిషనర్, ఆర్డీవో, సబ్‌రిజిస్ట్రార్లు సభ్యులుగా మార్కెట్ వాల్యూ రివిజన్ కమిటీలు ఏర్పాటు చేశారు. రూరల్ ఏరియాలో ఆర్డీవో చైర్మన్‌గా తహసీల్దార్, ఎంపీడీవో సభ్యులుగా, కన్వీనర్‌గా సబ్‌రిజిస్ట్రార్లతో కమిటీలు ఏర్పాటు చేశారు. ఈ కమిటీలు సమావేశమై ప్రస్తుతం జిల్లాల్లోని భూముల మార్కెట్ విలువకు ఆయా ప్రాంతాల్లో బహిరంగ మార్కెట్ విలువకు వ్యత్యాసం ఎంత ఉందనేది నివేదికను స్టాంపులు, రిజిస్ట్రేషన్ ఐజీకి పంపించినట్లు సమాచారం.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

- ప్రైవేట్ నుంచి ప్రభుత్వ పాఠశాలకు 35 మంది విద్యార్థులు
- లింగాపూర్ ఎంపీపీఎస్ ఆదర్శం
- కలెక్టర్ పమేలా సత్పతి

మానకొండూర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలతో కూడిన నాణ్యమైన విద్య అందుతోందని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మండలంలోని లింగాపూర్ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశానికి కచ్చితంగా హజరు కావాలని సూచించారు. అప్పుడే పిల్లల చదువు తీరును తెలుసుకోవచ్చన్నారు. ఐదో తరగతి విద్యార్థులపై అత్యంత శ్రద్ధ అవసరమని, ప్రభుత్వ పాఠశాలల్లో ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. లింగాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలకు వివిధ ప్రైవేటు పాఠశాలల నుంచి 35 మంది విద్యార్థులు రావడం గొప్ప విషయమన్నారు. ఇందుకు కృషి చేసిన ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను ఆమె అభినందించారు. లింగాపూర్‌లో ఐదేళ్లు నిండిన అంగన్‌వాడీ చిన్నారులు మొత్తం మంది పాఠశాలలో చేరడం సంతోషదాయకమన్నారు. ఏడో తరగతి పూర్తి చేసిన నూరు శాతం విద్యార్థులు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చేరడంపై అభినందించారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. రెండో తరగతి విద్యార్థినితో న్యూస్ పేపర్ చదివించారు. పలువురు విద్యార్థులు ప్రయోగాత్మకంగా నేర్చుకున్న అంశాలను కలెక్టర్‌కు వివరించారు. తరగతి గదులను సందర్శించి విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని ఉపాధ్యాయులకు కోరారు. గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. ఇళ్ల నిర్మాణం త్వరగా చేపట్టి దశల వారీగా బిల్లులు తీసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. కార్యక్రమంలో క్వాలిటీ కో-ఆర్డినేటర్ అశోక్‌రెడ్డి, తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంపీడీవో వరలక్ష్మి, ఎంఈవో మధుసూదన్, హెచ్‌ఎం శ్రీనివాస్ జియ్యంగార్, స్కూల్ కాంప్లెక్స్ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థినితో చదివిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

మహిళలను ఎస్‌హెచ్‌జీలో చేర్పించాలి

- డీఆర్డీవో శ్రీధర్

కరీంనగర్ రూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఇప్పటి వరకు మహిళా సంఘాల్లో లేని వారిని ఎస్‌హెచ్‌జీలో చేర్పించాలని డీఆర్డీవో శ్రీదర్ అన్నారు. మంగళవారం కరీంనగర్ రూరల్ మండలంలో ఇందిరా మహిళా శక్తి విజయోత్సవంపై ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం బ్యాంకు లింకేజీ లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు. కొత్తగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు కావాల్సిన వారు ప్రతిపాదనలు పంపించాలన్నారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో ఏపీఎం భార్గవ్, సీసీలు శ్రీనివాస్, కనుకయ్య, అధ్యక్షురాలు మయూరి, వీవోల అధ్యక్షులు పాల్గొన్నారు.

యూరియా కోసం ఆందోళన వద్దు

- హుజూరాబాద్ ఏడీఏ జి సునీత

జమ్మికుంట రూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతులు ఆందోళన చెందవద్దని హుజూరాబాద్ ఏడీఏ జి సునిత అన్నారు. మంగళవారం జమ్మికుంట మండలం మాచనపల్లిలో ఓ రైతు సాగు చేస్తున్న జీలుగ పంటను మండల వ్యవసాయ శాఖ అధికారి ఖాదర్ హుస్సేన్‌తో కలిసి ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హుజూరాబాద్ డివిజన్‌లో రెండు, మూడు రోజుల్లో అన్ని సెంటర్లకు యూరియా సరఫరా జరుగుతుందన్నారు. రైతులు అవసరం మేరకు మాత్రమే యూరియా తీసుకు వెళ్లాలని సూచించారు. యూరియా ఎక్కువగా వినియోగించడం వల్ల మొక్కలు తెగుళ్ల బారిన పడ తాయన్నారు. పంటలకు వేసే కాంప్లెక్స్ ఎరువుల్లోనూ నత్రజని ఉంటుందని, అవి కొంత మేర నత్రజని అవసరాన్ని తీరుస్తాయని తెలిపారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు వాతా వరణంలోని నత్రజని కరిగి పంటలకు అందు బాటులోకి వస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రెండు నెలలకు కావాల్సిన ఎరువులను అందుబాటులో ఉంచిందని చెప్పారు. డీలర్లు ఎమ్మార్పీకి మించి విక్రయిస్తే తమ దృష్టికి తీసుకురావాలని రైతులకు సూచించారు.



జమ్మికుంట మండలం మాచనపల్లిలో జీలుగ పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

డీట్ యాప్‌పై యువతకు అవగాహన కల్పించాలి

- అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే



సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే

కరీంనగర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఏఐ ఆధారిత డీట్ (డిస్ట్రిక్ట్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ) యాప్‌పై నిరుద్యోగ యువత, విద్యార్థులకు అవగాహన కల్పించాలని అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్‌హాల్‌లో జిల్లా పరిశ్రమల కేంద్రం ఆధ్వర్యంలో డీట్ యాప్‌పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఉన్న పరిశ్రమలు, సంస్థలు, గ్రానైట్స్, రైస్ మిల్లులు ఈ యాప్‌లో రిజిస్టర్ అయ్యే విధంగా చూడాలన్నారు. ప్రైవేట్ సంస్థల్లో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే ఉద్దేశంతో ఈ యాప్‌ను రూపొందించారన్నారు. ఐటీఐ, పాలిటెక్నిక్, తదితర కళాశాలల ఫైనల్ ఇయర్ విద్యార్థులు, యువత, స్కిల్ వర్కర్లు ఈ యాప్‌లో నమోదయ్యేలా చూడాలని ఆదేశించారు. ఎంప్లాయర్లు తమకు కావాల్సిన అర్హత కలిగిన వారిని ఎంపిక చేసే అవకాశం ఉంటుందని, రాష్ట్ర వ్యాప్తంగా అనేక మందికి ఉపాధి మార్గాలు లభిస్తాయని తెలిపారు. సమావేశంలో మెప్మా పీడీ వేణుమాధవ్, ఎన్‌వైకే కో-ఆర్డినేటర్ రాంబాబు, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ సాల్మన్ రాజు

నిధులు మంజూరైనా ప్రారంభంకాని పనులు

- మూలుగుతున్న రూ. 80 లక్షలు
- పట్టించుకోని పాలకులు
- అధ్వానంగా మారిన రోడ్లతో ఇబ్బంది పడుతున్న ప్రజలు

కరీంనగర్ రూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఆ రోడ్ల నిర్మాణానికి రెండేళ్ల క్రితం 80 లక్షల రూపాయల నిధులు మంజూరయ్యాయి. కాని పనులు ప్రారంభం కాలేదు. రోడ్ల పనులు ప్రారంభమవు తాయని భావించిన ప్రజలకు నిరాశే మిగిలింది. వర్షాకాలం ప్రారంభం కావడంతో ఇప్పుడున్న రోడ్లు దెబ్బతిని గుంతలమ యంగా మారాయి. రెండేళ్లుగా రోడ్ల గురించి పాలకులు పట్టించు కోకపోగా ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కరీంనగర్ రూరల్ మండలం నగునూర్ గ్రామంలో రెండేళ్ల క్రితం రోడ్ల నిర్మాణానికి ఈజీఎస్ నిధులు 80 లక్షల రూపాయలు మంజూరయ్యాయి. దానికి సంబంధించిన ప్రొసిడింగ్స్ కూడా ఇచ్చారు. ప్రధాన రహదారి నుంచి గ్రామ పంచాయతీ వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి 40 లక్షల రూపాయలు, గ్రామ శివారులోని చెక్ డ్యాం నుంచి సమ్మక్క సారలమ్మ జాతర వరకు మెటల్ రోడ్డు నిర్మాణానికి 40 లక్షల నిధులు మంజూరయ్యాయి. సెప్టెంబరు 2023లో నిధులు మంజూరు చేశారు. ఇంతలో ఎన్నికలు వచ్చాయి. ఆ పనులు కాస్తా మూలన పడ్డాయి. ఈ రోడ్లు తీవ్రంగా దెబ్బతినడంతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. మరో ఆరు నెలల్లో సమ్మక్క సారలమ్మ జాతర జరగనుంది. అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించి రోడ్ల పనులు పూర్తి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.



గుంతలమయంగా నగునూర్ రోడ్డు

సార్వత్రిక సమ్మెకు మద్దతుగా ఉపాధ్యాయ సంఘాల ర్యాలీ

గణేశ్‌నగర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక సమ్మెకు మద్దతుగా యూఎస్‌పీసీ (ఉపాధ్యాయ సంఘాల పోరాట సమితి) ఆధ్వర్యంలో మంగళవారం నగరంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యూఎస్‌పీసీ రాష్ట్ర బాధ్యుడు వైద్యుల రాజిరెడ్డి మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక చట్టాలను నిరసిస్తూ నిర్వహిస్తున్న సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూటీఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ముల్కల కుమార్, ఎండీ జావిద్, డీటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శి ఆవాల నరహరి, చకినాల రామ్మోహన్, టీపీటీఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామచంద్రారెడి, వేల్పుల బాలయ్య, రాష్ట్ర మాజీ అధ్యక్షుడు నారాయణరెడ్డి, రఘుశంకర్‌రెడ్డి, డీటీఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు తూముల తిరుపతి, ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

వరద గండం
- భయంభయంగా గడుపుతున్న జమ్మికుంట హౌసింగ్‌బోర్డు కాలనీ వాసులు
- శాశ్వత చర్యలు కరువు
6

ముగిసిన రాజన్న జోన్ పోలీస్ డ్యూటీ మీట్
- విజేతలకు పతకాలు అందజేత
7

మినీ స్టేడియానికి మోక్షం ఎప్పుడో?

- ప్రతిపాదనలకే పరిమితం

చొప్పదండి, జూలై 8: నియోజకవర్గ కేంద్రమైన చొప్పదండిలో మినీ స్టేడియం నిర్మాణానికి మోక్షం కలగడం లేదు. పట్టణంగా మారి జనాభా పెరిగినప్పటికి మినీ స్టేడియం లేక పోవడంతో యువత విద్యార్థులకు ఆటలు ఆడేందుకు క్రీడా మైదనం అందుబాటులో లేక ఇబ్బందులకు గురవుతున్నారు. చొప్పదండి జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలోనే ప్రజలు వ్యాయామం, క్రీడలకు ఉపయోగించుకుంటున్నారు. 20 ఏళ్ల క్రితం చొప్పదండిలో మినీ స్టేడియం కోసం ప్రతిపాదనలు పంపించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో స్టేడియం నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించగా పట్టించుకునే వారు కరువుకావడంతో ప్రతిపాదనలు కాగితానికే పరిమితమయ్యాయి. ఆ స్థలంలో డిగ్రీ కళాశాల భవనం నిర్మించగా అది వృథాగా మారింది. తాజాగా ఈ స్థలంలో వంద పడకల ఆసుపత్రికి స్థలం కేటాయించగా ఆసుపత్రి నిర్మాణం పూర్తి అయ్యింది. మున్సిపల్ శాఖ మంజూరు చేసిన ఓపెన్ జిమ్‌ను జడ్పీ బాలుర స్కూల్ మైదానంలోనే ఏర్పాటు చేశారు. మినీ స్టేడియం నిర్మాణానికి స్థలం కేటాయింపు సమస్యగా మారింది. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి చొప్పదండిలో మినీ స్టేడియంను నిర్మించాలని క్రీడాకారులు, యువకులు, ప్రజలు కోరుతున్నారు.



చొప్పదండి జడ్పీ హైస్కూల్ క్రీడా మైదానం



స్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్

వరద గండం

- భయంభయంగా గడుపుతున్న జమ్మికుంట హౌసింగ్‌బోర్డు కాలనీ వాసులు
- 2018, 2021లో నీట మునిగిన ఇళ్లు
- నష్టపరిహారం అందజేసి చేతులు దులుపుకున్న వైనం
- శాశ్వత చర్యలు కరువు

జమ్మికుంట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఐదు వందల కుటుంబాలు నివసిస్తున్న జమ్మికుంట హౌసింగ్ బోర్డు కాలనీ వర్షాకాలం వచ్చిందంటే వరద భయంతో బిక్కుబిక్కుమంటోంది. భారీ వర్షం కురిసిందంటే కాలనీలోని ఇళ్లన్నీ నీట మునుగాల్సిందే. వరద నీరు ఇళ్లలోకి చొచ్చుకువచ్చి నిత్యవసర వస్తువులు నీళ్ల పాలై, కట్టుబట్టలతో కాలనీ వాసులు రోడ్డు ఎక్కిన సంఘటనలు ఉన్నాయి. గడిచిన ఆరేళ్ల కాలంలో రెండుసార్లు కాలనీ నీటిమునిగింది. ఆ సమయంలో పాలకులు, అధికారులు హడావుడి చేసి నష్టపరిహారం అందించి చేతులు దులుపుకున్నారు. ఇప్పటికి శాశ్వత పరిష్కారం చూపలేక పోయారు. మళ్లీ వర్షాకాలం రావడంతో కాలనీవాసులు ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయపడుతున్నారు.



వరద ఉధృతి (ఫైల్)



హౌసింగ్‌బోర్డులో వరద నీరు (ఫైల్)

లోతట్టు ప్రాంతం..

జమ్మికుంట పట్టణ పరిధిలోని హౌసింగ్ బోర్డు కాలనిలో ఐదు వందల కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. లోతట్టు ప్రాంతం కావడంతో 2018లో కురిసిన భారీ వర్షానికి సుమారు మూడు వందల ఇళ్లు నీట మునిగాయి. నిత్యావసర వస్తువులు, ఎలక్ట్రానిక్ పరికరాలు, నగదు నీళ్లపాలయ్యాయి. కట్టుబట్టలతో బంధువుల ఇళ్లకు వెళ్లి తల దాచుకున్నారు. మూడు రోజుల పాటు పాలకులు, అధికారులు పని చేస్తే వరద నీరు బయటకు వెళ్లింది. ఆ సమ యంలో ప్రభుత్వం నుంచి ఎలాంటి నష్టపరిహారం అందలేదు.

వరద కాలువ నిర్మించినా..

మున్సిపల్ పాలకవర్గం 2018లో 35 లక్షల నిధులతో వరద కాలువ నిర్మాణ పనులు చేపట్టింది. 2020లో పనులు పూర్తయ్యాయి. దానితో ఎటువంటి ఉపయోగం లేకుండా పోయింది. 2021లో కురిసిన భారీ వర్షానికి హౌసింగ్‌బోర్డు కాలనీలోని మూడు వందలకు పైగా ఇళ్లు నీట మునిగాయి. వరద కాలువ నుంచి ఉప్పొంగిన నీళ్లు కాలనీని చుట్టుముట్టాయి. ఆ సమయంలో హుజూరాబాద్ ఉప ఎన్నిక సమీపించడంతో, అధికార యంత్రాంగం మొత్తం కదిలి వచ్చింది. దగ్గరుండి సహాయక చర్యలు చేపట్టింది. కాలనీలోని పార్కు దగ్గర నుంచి ఏడు ఫీట్ల వెడల్పుతో ఎక్స్‌కావేటర్ల సహాయంతో మట్టి కాల్వ తీయడంతో వరద నీరు వెళ్లిపోయింది. 2021లో హౌసింగ్ బోర్డు కాలని దుస్థితిని చూసిన అప్పటి కలెక్టర్ వరద కాలువను విస్తరించాలని, ఇందుకు ఎస్టిమేట్ రూపొందించి ప్రభుత్వానికి పంపించాలని ఇంజనీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. 53 లక్షలతో అధికారులు ప్రతిపాదనలు పంపించినా నిధులు మంజూరు కాలేదు. వర్షాకాలం వచ్చింది. ఈసారి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. దీంతో హౌసంగ్‌బోర్డు కాలనీ వాసులు ఆందోళన చెందుతున్నారు. తమ కాలనీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలని అధికారులు, ప్రజాప్రతినిధులను కోరుతున్నారు.



నీట మునిగిన ఇల్లు (ఫైల్)

శాశ్వత పరిష్కారం చూపించాలి



శ్రీపతి నరేష్, మాజీ కౌన్సిలర్

వరద కాల్వ నిర్మాణ పనులు త్వరగా చేపట్టాలి. మళ్లీ వర్షాకాలం వచ్చింది. భారీ వర్షం పడితే కాలనీవాసులు కంటి మీద కునుకు లేకుండా జాగా రం చేయాల్సిన దుస్థితి. 2018, 2021లో ఇళ్లు నీట మునిగాయి. రాష్ట ప్రభుత్వం స్పందించి వరద కాలు వ నిర్మాణం చేపట్టి శాశ్వత పరిష్కారం చూపించాలి.

వరదలతో తీవ్రంగా నష్టపోయాం



బెజ్జంకి నరహరి, హౌసింగ్‌బోర్డు కాలనీవాసి

హౌసింగ్‌బోర్డు కాలనీలో 22 సంవత్సరాలుగా నివసిస్తున్నా. 2018లో మొదటి సారి ఇళ్లు మొత్తం నీట మునిగాయి. ఆ సమయంలో ఒక వైపు వరద కాల్వ నిర్మించి వదిలేశారు. 2021లో మళ్లీ భారీ వర్షాలు వచ్చాయి. ఆ సమయంలో కాలనిలోని వందలాది ఇళ్లు నీట మునిగాయి. నిత్యవసర వస్తువులు, నగదు, ఇతర వస్తువులు మొత్తం నీటిపాలయ్యాయి. వరద తగ్గేవరకు బంధువుల ఇళ్లలో తలదాచుకున్నాం. వరద సమయంలో తీవ్రంగా నష్టపోయాం. ప్రభుత్వం స్పందించి వరద సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలి.

15 కిలోల గంజాయి పట్టివేత

- నలుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

జమ్మికుంట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మండలం మడిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో గల శాంతినగర్‌లో 15కిలోల గంజాయిని కరీంనగర్ టాస్క్‌ఫోర్స్ పోలీస్‌లు మంగళవారం పట్టుకున్నారు. కరీంనగర్‌కు చెందిన అఫ్రిద్, శశిప్రీతం, తరుణ్, జమ్మికుంటకు చెందిన ప్రేమ్‌చంద్‌కుమార్ ఒక ముఠాగా ఏర్పడి గంజాయి వ్యాపారం చేయాలని నిర్ణయించుకున్నారు. ఆంధ్రప్రదేశ్-ఒరిస్సా సరిహద్దులో తక్కువ ధరకు కొనుగోలు చేసి స్థానికంగా ఎక్కువ ధరకు అమ్మవచ్చని అభిప్రాయానికి వచ్చారు. నలుగురు కలిసి రెండు ద్విచక్ర వాహనాలపై ఇటీవల ఆంధ్రప్రదేశ్-ఒరిస్సా సరిహద్దుకు వెళ్లారు. అక్కడ 15కిలోల గంజాయి కొనుగోలు చేసి మంగళవారం ఇక్కడకు వచ్చారు. జమ్మికుంటకు చెందిన ప్రేమ్‌చంద్‌కుమార్ ఇంట్లో నిల్వచేసి తర్వాత అమ్మకాలు జరుపుదామని నిర్ణయానికి వచ్చారు. పక్కా సమాచారం అందుకున్న కరీంనగర్ టాస్క్‌ఫోర్స్ పోలీస్‌లు వారిని వలపన్ని పట్టుకున్నారు. వారివద్ద ఉన్న 15కిలోల గంజాయి, రెండు ద్విచక్ర వాహనాలు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకోని జమ్మికుంట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. గంజాయి ముఠా వివరాల కోసం సీఐ ఎస్ రామకృష్ణగౌడ్‌ను సంప్రదించగా బుధవారం వెల్లడిస్తామని తెలిపారు.

40మంది మందుబాబులకు జరిమానా

సిరిసిల్ల క్రైం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 40మంది మందుబాబులకు మంగళవారం సిరిసిల్ల 2వ శ్రేణి మెజిస్ట్రేట్ జయశ్రీ తీర్పు ఇచ్చారని టౌన్ సీఐ కె కృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 27మందికి ఒక్కొక్కరికి 1000 రూపాయలు, మరో ముగ్గురికి 1500 రూపాయలు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతూ పట్టుబడిన 13మందికి ఒక్కొక్కరికి 1000 రూపాయల జరిమానా విధించారన్నారు. ఈ సందర్భంగా సిరిసిల్ల పట్టణంలోని పట్టుబడిన మందుబాబులకు సిరిసిల్ల ట్రాఫిక్ ఆర్ఎస్ఐ దిలీప్ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ ఇచ్చి, మద్యం సేవించి వాహనాలు నడపబోమని ప్రతిజ్ఞ చేయించారన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపినా, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించినా జైలు శిక్ష తప్పదని ఆయన హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన యువతకు భవిష్యత్తులో వచ్చే ఉద్యోగ అవకాశాలు, ఉపాధి అవకాశాలకు ఇబ్బందులు ఎదురవుతాయని తెలిపారు. ట్రాఫిక్, రోడ్ భద్రత నియమాలు ఉల్లంఘిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

10 మంది బైండోవర్

కరీంనగర్ క్రైం, జూలై 8(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలంలో పేకాట ఆడుతూ పట్టుబడిన ఎనిమిది మందితో పాటు ఇటీవల ఇసుకను అక్రమంగా తరలిస్తూ పట్టుబడిన ఇద్దరిని తహసీల్దార్ ఎదుట మంగళవారం హాజరుపరచి బైండోవర్ చేసినట్లు కరీంనగర్ రూరల్ సీఐ ఏ నిరంజన్‌రెడ్డి తెలిపారు. చేగుర్తి శివారులోని వాగు నుంచి ఇసుకను దొంగతనంగా ట్రాక్టర్ ద్వారా రవాణా చేస్తూ పట్టుబడిన దుర్శేడ్ గ్రామానికి చెందిన కాశిపాక అర్జున్, నల్లగుంటపల్లికి చెందిన విలాసాగరం శేఖర్‌లతో పాటు ఇటీవల పేకాట ఆడుతూ పట్టుబడిన ఎనిమిది మందిని కరీంనగర్ రూరల్ తహసీల్దార్ ఎదుట హాజరుపరచినట్లు తెలిపారు. మరోసారి తప్పు చేసిన సందర్భంలో లక్ష రూపాయల జరిమానా లేదా ఆరు నెలల జైలు శిక్ష విధించేలాగా బైండోవర్ చేసి, సొంత పూచీకత్తుపై విడుదల చేసినట్లు సీఐ తెలిపారు.

విద్యుత్ తీగలు తెగిపడి గొర్రెలు మృతి

కాల్వశ్రీరాంపూర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తారుపల్లి గ్రామంలో విద్యుత్ తీగలు తెగిపడి గొర్రెలు మృతి చెందాయి. గొర్లకాపరి గిరవేన అజయ్ మంగళవారం గ్రామశివారు నక్కల ఒర్రె సమీపంలో గొర్రెలను మేపుతుండగా కరెంటు వైర్లు తెగిపడి మూడు గొర్రెలు మృతి చెందాయి. మాజీసర్పంచ్ గాజనవేన సదయ్యకు సమాచారం ఇవ్వడంతో ఆయన వెంటనే విద్యుత్ అధికారులకు తెలుపగా విద్యుత్ సరఫరా నిలిపివేశారు. చనిపోయిన గొర్రెల విలువ సుమారు 40 వేల రూపాయలు ఉంటుందని బాధితుడు అజయ్ తెలిపారు. ప్రభుత్వపరంగా ఆదుకోవాలని ఆయన వేడుకుంటున్నాడు.

మొబైల్‌ఫోన్ అప్పగింత



బాధితుడికి సెల్‌ఫోన్ అందజేస్తున్న వీర్నపల్లి ఎస్ఐ లక్ష్మణ్

కరీంనగర్ క్రైం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం ఆరెపల్లికి చెందిన బి సాయికిరణ్ మార్చి 21న తన సెల్‌ఫోన్‌ను గ్రామంలో పోగొట్టుకోగా కరీంనగర్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సీఈఐఆర్ టెక్నాలజీతో సెల్‌ఫోన్‌ను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు మంగళవారం సెల్‌ఫోన్‌ను యజమాని సాయికిరణ్‌కు కరీంనగర్ రూరల్ సీఐ ఏ నిరంజన్‌రెడ్డి పోలీసుఠాణాలో అందజేశారు. పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను గుర్తించి, స్వాధీనం చేసుకోవటంలో కృషి చేసిన కరీంనగర్ రూరల్ ఠాణా కానిస్టేబుల్ విశ్వతేజను సీఐ అభినందించారు.

వీర్నపల్లి: నూతన సాంకేతిక పరిజ్ఞానం(సీఈఐఆర్)తో పోగొట్టుకున్న సెల్‌ఫోన్ వెతికి పట్టుకున్నట్లు ఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు. వీర్నపల్లి మండలం గర్జనపల్లి గ్రామానికి చెందిన గుంటుకు రాజు పదిరోజుల క్రితం సెల్‌ఫోన్ పొగొట్టుకోగా పోలీసులకు పిర్యాదు చేశాడు. దీంతో సీఈఐఆర్ ద్వారా పోలీసులు సెల్‌ఫోన్ కనుక్కోని పిర్యాదుదారుడికి అందించారు.

అత్యాచారం కేసులో నిందితుడి రిమాండ్

ధర్మపురి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతిపై పది రోజుల క్రితం అత్యాచారం చేసిన కేసులో గాదెపల్లి గ్రామానికి చెందిన నిందితుడు వెలుగు గంగాధర్‌ను మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రాంనర్సింహారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఉదయ్ కుమార్ కేసు నమోదు చేయగా నిందితుడు గంగాధర్‌ను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

జగిత్యాల క్రైం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కేంద్రంలో ఉరి వేసుకుని పూజిత(20) అనే వివాహిత మంగళవారం ఆత్మహత్యకు పాల్పడింది. రాజన్న సిరిసిల్ల జిల్లా అగ్రహారానికి చెందిన చందు అనే యువకుడికి జగిత్యాల జిల్లా భీమారం మండలం రాగోజీపేట గ్రామానికి చెందిన పూజితతో రెండేళ్ల క్రితం వివాహం జరిగింది. ఉపాధి కోసం వీరు జగిత్యాలలోని కృష్ణానగర్ ప్రాంతానికి వలస వచ్చారు. పూజిత తండ్రి మల్లేశ్ మూడేళ్ల క్రితం అనారోగ్యంతో మృతిచెందగా, పెద్దనాన్న ఇటీవల గుండెపోటుతో మృతిచెందాడు. అప్పటి నుంచి పూజిత మానసిక వేదనకు గురైంది. మంగళవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లి రజిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు జగిత్యాల పట్టణ పోలీసులు పేర్కొన్నారు.

మద్యానికి బానిసై యువకుడు..



శ్రీనివాస్(ఫైల్)

తంగళ్లపల్లి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చీర్లవంచ గ్రామానికి చెందిన గంగు శ్రీనివాస్(22) అనే యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, కుంటుంబసభ్యుల కథనం.. గంగు బక్కయ్య-వజ్జమ్మ దంపతుల కుమారుడు శ్రీనివాస్ కొద్దిరోజులుగా వ్యసనాలకు, మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి ఇంటి నుంచి వెళ్లిన శ్రీనివాస్ గ్రామ శివారులోని గ్రామ పంచాయతీ డంపుయార్డ్ షెడ్డులో మంగళవారం ఉరికి వేలాడుతూ కనిపించాడు. మృతుడి తండ్రి బక్కయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బావిలో పడి వృద్ధురాలి మృతి

ఇల్లందకుంట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్రివానిపల్లెకు చెందిన కాటిపల్లి అమృతమ్మ (70) అనే వృద్ధురాలు బావిలో పడి మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అమృతమ్మ కొద్దిరోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది సోమవారం ఇంట్లో నుంచి బయటికి వెళ్లింది. ఆమె ఆచూకీ కోసం వెతుకగా మంగళవారం అదే గ్రామంలోని ఓ బావిలో మృతి చెంది కనపడింది. మృతురాలి కుమారుడు రవీందర్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపారు.

భూ వివాదం కేసులో ఒకరి అరెస్ట్

ఎల్లారెడ్డిపేట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): భూవివాదం కేసులో ఎల్లారెడ్డిపేట మండలం అగ్రహారం గ్రామానికి చెందిన మునిగే మల్లయ్యను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ రాహుల్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకట నలో తెలిపారు. గ్రామంలోని అన్నదమ్ములు మునిగే దేవ య్య, మునిగే మల్లయ్య మధ్య కొంతకాలంగా భూవివాదం కొనసాగుతోందని పేర్కొన్నారు. గత నెల 25న ఇరు కుటుంబాల మధ్య గొడవ తారా స్థాయికి చేరుకోవడంతో ఆగ్రహించిన మల్లయ్య కర్రతో దేవయ్యపై దాడి చేసి గాయపర్చాడని చెప్పారు. బాధితుడు దేవయ్య భార్య అరుణ ఫిర్యాదు మేరకు మునిగే మల్లయ్య, అతని భార్య మనెవ్వలపై కేసు నమోదు చేశామని చెప్పారు. దర్యాప్తు అనంతరం మల్లయ్యను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ రాహుల్‌రెడ్డి వివరించారు.

ఇద్దరు విలేకరులపై కేసు

ఎల్లారెడ్డిపేట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా మట్టిని తరలిస్తున్నావంటూ ఓ వ్యక్తిని డబ్బులు డిమాండ్ చేయడంతో పాటు తహసీల్దార్ పేరిట డబ్బులు ఇవ్వాలని బెదిరింపులకు దిగిన సంఘటనలో ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన ఇద్దరు విలేకరులు శ్రీరామోజు ప్రవీణ్, ఒగ్గు బాలరాజుపై కేసు నమోదు చేశామని ఎస్ఐ రాహుల్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని రాజన్నపేటకు చెందిన వ్యక్తి ఊడుగుల సురేందర్ ఈనెల 6న తన రెండు టిప్పర్లతో మట్టిని మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాల వద్ద పోస్తున్న క్రమంలో ప్రవీణ్, బాలరాజు అక్కడకు చేరుకుని అనుమతి లేదం టూ బెదిరించి పేపర్లలో రాకుండా ఉండేందుకు రూ.10 వేలు తీసుకున్నారని పేర్కొన్నారు. మరుసటి రోజు మట్టిని రవాణా చేసుకునేందుకు తహసీల్దార్ రూ.30 వేలు అ డుగుతున్నారని చెప్పడంతో పాటు ఇబ్బందులకు గురి చేసి అసత్యప్రచారం చేశారని చెప్పారు. సదరు వ్యక్తి వద్ద డబ్బులు తీసుకోవడంతో పాటు తన పేరు చెప్పి రూ.30 వేలు డిమాండ్ చేసిన విలేకరులు ప్రవీణ్, బాలరాజుపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ సుజాత ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని ఎస్ఐ రాహుల్‌రెడ్డి వివరించారు.

9న ఇసుక వేలం

కరీంనగర్ క్రైం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఇటీవల అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్లను పోలీసులు స్వాధీనం చేసుకోగా ఆ ఇసుకను ఈ నెల 9న ఉదయం 11 గంటలకు వేలం వేయనున్నట్లు కొత్తపల్లి తహసీల్దార్ ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు 80 టన్నుల వరకు ఇసుక వేలం వేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ధరావత్తు సొమ్ము 600 రూపాయలు చెల్లించి పద్మనగర్‌లోని కొత్తపల్లి తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో నిర్వహించనున్న వేలంలో పాల్గొనాలని సూచించారు. అలాగే తనిఖీల్లో పట్టుబడిన 10 ట్రాక్టర్ల ఇసుకను తహసీల్దార్ కార్యాల య ఆవరణలో వేలం వేయనున్నట్లు తెలిపారు. దీని వేలంలో పాల్గొనేవారు 1,650 రూపాయలు ధరావత్తు సొమ్ము చెల్లించాలని సూచించారు.

తల్లిదండ్రులను పోషిస్తేనే ఆస్తులు



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఆర్డీవో వెంకటేశ్వర్లు

- ఆర్డీవో వెంకటేశ్వర్లు

సిరిసిల్ల టౌన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులను అన్ని విధాలుగా పోషిస్తేనే వారసత్వంగా వచ్చే ఆస్తులు కొడుకులకు చెందుతా యని ఆర్డీవో వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయంలో తెలంగాణ సీనియర్ సీనియర్ సిటీజన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తల్లిదండ్రులను విస్మరించిన కొడుకులు, కూతుళ్లతో పాటు కోడళ్లకు ఆర్డీవో వెంకటేశ్వర్లు కౌన్సెలింగ్ నిర్వహించి నాలుగు కేసులను పరిష్కరించారు.

ఈ సందర్భంగా ఆర్డీవో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తల్లిదండ్రులను పోషించడంలో కొడుకులు, కూతుళ్లు నిర్లక్ష్యం చేస్తే సంపాదించిన ఆస్తులను తిరిగి తల్లిదండ్రుల పేరిట నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సీనియర్ సిటిజన్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జనపాల శంకరయ్య, కోశాధికారి దొంత దేవదాసు, సీనియర్ అసిస్టెంట్ విజయలక్ష్మి, అధికారులు బాధిత తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బూరుగు చెరువులోకి నీటి విడుదల

- సంతోషం వ్యక్తం చేస్తున్నరైతులు

కోనరావుపేట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): బూరుగు చెరువులోకి నీటిని విడుదల చేయడంతో రైతులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. కోనరావుపేట మండలం కనగర్తి బూరుగు చెరువులోకి అధికారులు స్పందించి పైప్ లైన్లు ఏర్పాటు చేసి నీరు వచ్చేలా చేశారు. ఈ మధ్యనే మల్కపేట రిజర్వాయర్ నుంచి కుడి కాలువ ద్వారా నీటిని ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ విడుదల చేశారు. నీటిని మారుపాక, సుద్దాల గ్రామాలకు వెళ్లడానికి కనగర్తి గ్రామం వద్ద అడ్డుకట్ట వేశారు. దీంతో కనగర్తి గ్రామంలోని బూరుగు చెరువుకు నీరు అందలేదు. వానాకాలం సీజన్‌లో ఇబ్బందులు తలెత్తుతాయని ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో అడ్డుకట్టను తొలగించి పైప్‌లైన్ ఏర్పాటు చేసి బూరుగు చెరువులోకి నీరు చేరే విధంగా అధికారులు చర్యలు చేపట్టారు. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



కనగర్తి బూరుగు చెరువులోకి చేరుతున్న నీరు

ఆత్మహత్యాయత్నం చేసిన ఇంటర్ విద్యార్థి మృతి

జగిత్యాల క్రైం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ ఫెయిల్ అయ్యాడనే మనస్తాపంతో జగిత్యాలలో ఆత్మహత్యాయత్నం చేసిన ఇంటర్ విద్యార్థి నల్ల లోహాన్(17) మంగళవారం చికిత్స పొందుతూ మృతిచెందాడు. జిల్లా కేంద్రంలోని గోవిందుపల్లికి చెందిన నల్ల లోహాన్ పట్టణంలోని ఓ కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. ఇటీవల విడుదలైన ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల్లో ఫెయిల్ కావడంతో అప్పటి నుంచి తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. సోమవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో లోహాన్ ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు, గమనించిన కుటుంబసభ్యులు ఆసు పత్రికి తరలించగా కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుప త్రిలో చికిత్స పొందుతూ లోహాన్ మంగళవారం ఉదయం మృతి చెందాడు. విద్యార్థి తండ్రి లక్ష్మణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు జగిత్యాల టౌన్ పోలీసులు పేర్కొన్నారు.

జీవో నంబర్ 282ను రద్దు చేయాలి

- సిరిసిల్లలో జీవో కాపీల దహనం

సిరిసిల్ల రూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కార్మికులకు పనిగంటలను పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో 282ను వెంటనే రద్దుచేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో మంగళవారం సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకవచ్చిన జీవో 282ను రద్దుచేయాలంటూ జీవో కాపీలను నాయకులు దహనం చేసి నిరసనలు తెలిపారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ పెట్టుబడిదారులు, కార్పోరేట్ శక్తుల లాభాల కోసం కార్మిక వర్గాన్ని శ్రమదోపిడిలకు గురి చేసే విధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎనిమిది గంటల పని విధానాన్ని 10గంటలుగా మార్చుతూ జారీచేసిన జీవోను సీఐటీయూ వ్యతిరేకిస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడుతూ ఆచరణలో మాత్రం బీజేపీ ప్రభుత్వానికి అనుకూల విధానాలకు అవలంబిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు అవుతోందని కార్మికులకు సంబంధించి షెడ్యూల్డ్ పరిశ్రమల కార్మికులకు కనీస వేతనాల జీవోలను సవరించకుండా పనిగంటలు పెంచుతూ జీవోను తీసుకురావడం జరిగిందన్నారు. ఈ జీవోకు వ్యతిరేకంగా కార్మిక వర్గం ఐక్యంగా పోరాడాలని బుధవారం కార్మిక చట్టాల హక్కుల పరిరక్షణ కోసం జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మికవర్గం అత్యధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గన్నేరం నర్సయ్య, సీఐటయూ నాయకులు జిందం కమలాకర్, బాలయ్య, రాజయ్య, దేవరాజు, లక్ష్మీ, మమత, పోచమల్లు తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం

పెద్దపల్లి రూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దకల్వల గ్రామానికి చెందిన కేశెట్టి శ్రీధర్ అనే యువకుడు అదృశ్యమైనట్లు పెద్దపల్లి రూరల్ ఎస్ఐ మల్లేష్ ఒక ప్రటనలో తెలిపారు. సోమవారం ఇంటి నుంచి శ్రీధర్ వెళ్లిపోయి ఇప్పటి వరకు ఇంటికి చేరుకోకపోవడంతో సోదరుడు శ్రీకాంత్ ఎస్ఐకి ఫిర్యాదు చేశారు. దీంతో మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పెద్దపల్లి రూరల్ ఎస్ఐ మల్లేష్ తెలిపారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

సైదాపూర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండలంలోని గుజ్జులపల్లి గ్రామానికి చెందిన గీత కార్మికుడు పూదరి అజయ్ గురువారం సాయంత్రం తాటి చెట్టు ఎక్కి కిందకు దిగుతుండగా మోకు జారి కింద పడడంతో తీవ్ర గాయాలయ్యాయినట్లు స్థానికులు తెలిపారు. చికిత్సకోసం అజయ్‌ని హుజూరాబాద్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్సకోసం హన్మకొండలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక





ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు, ఎంపికైన విద్యార్థితో కోచ్

ధర్మారం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి ఫుట్ బాల్ పోటీలకు దొంగతుర్తి ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. పదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఆర్ అనూష, వి వైష్ణవి ఈ నెల 5వ తేదీన గోదావరిఖని సింగరేణి స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి బాలికల ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఈ నెల 9వ తేదీ నుంచి 12 వరకు మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా తరుపున ఆడనున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను మంగళవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వేణుగో పాల్‌రెడ్డి, వ్యాయామ విద్య ఉపాధ్యాయులు శ్రీనివాస్ తదితరులు అభినందించారు.

పాలకుర్తి, (ఆంధ్రజ్యోతి): బసంత్‌నగర్ ఇండియా మిషన్ పాఠశాలకు చెందిన ప్రియాంక కుమారి రాష్ట్ర స్థాయి బాలికల ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు కోచ్ కృష్ణమూర్తిగౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

గోదావరిఖని జవహర్ స్టేడియంలో జరిగిన ఉమ్మడి జిల్లాస్థాయి పోటీలలో ప్రతిభ కనబరిచి గోల్డ్‌మెడల్ సాధించారు. బుధవారం మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్‌లో జరిగే రాష్ట్రస్థాయి బాలికల ఫుట్‌బాల్ పోటీలకు ఎన్నికయ్యారని తెలిపారు. ఎంపికైన విద్యార్థిని ప్రిన్సిపాల్ మహేంద్ర, వైస్‌ప్రిన్సిపాల్ ప్రేమానందం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, అల్ట్రాటెక్ కంపెనీ యాజమాన్యం అభినందించారు.

డిగ్రీ సెకండ్ సెమిస్టర్ ఫలితాలు విడుదల


ఫలితాలను విడుదల చేస్తున్న ప్రొఫెసర్ డి. సురేష్ కుమార్, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డి. వరలక్ష్మి

గణేశ్‌నగర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల కరీంనగర్‌లో ఈ విద్యాసంవత్సరానికి చెందిన అండర్ గ్రాడ్యుయేట్(యూజీ) ద్వితీయ సెమిస్టర్ ఫలితాలను కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డి. వరలక్ష్మి, శాతవాహన యూనివర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ డి. సురేష్‌కుమార్ మంగళవారం విడుదల చేశారు. విభాగాల వారీగా ఉత్తీర్ణత శాతం: బీఏ:65.71శాతం, బీకాం:71.05, బీఎస్సీ (భౌతికశాస్త్రం)81.71, బీఎస్సీ (జీవశాస్త్ర విభాగం): 57.87 శాతం, మొత్తం ఉత్తీర్ణత 69.22 శాతం ఉన్నట్లు వారు తెలిపారు. ఫలితాలను కళాశాల వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల పరీక్షల నియంత్రణాధికారి డా. జి. శ్రీనివాస్ రెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు డా. రజనీదేవి, డా. కె. సతీష్ కుమార్, అకడమిక్ కో ఆర్డినేటర్లు డా. ఎన్. మనోజ్ కుమార్, డా.విద్య, ఎన్ఎస్ఎస్, కోఆర్డినేటర్ డా. మొగిలి పాల్గొన్నారు.

పాత పెన్షన్ స్కీంను అమలు చేయాలి


ప్రమాణ స్వీకారం చేస్తున్న టీఎన్జీవో కార్యవర్గ సభ్యులు

జ్యోతినగర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు బొంకూరి శంకర్ డిమాండ్ చేశారు. రామగుండం మండల టీఎన్జీవో కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం మంగళవారం ఎన్టీపీసీలోని ఒక ప్రైవేటు ఫంక్షన్ హాలులో నిర్వహించారు. శంకర్ మాట్లాడుతూ సంఘం బలోపేతానికి కమిటీ నాయకత్వం, ఉద్యోగులు కలిసికట్టుగా పని చేయాలన్నారు. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. టీఎన్జీవోల డిమాండ్ల సాధనకు సంబంధించి ఉద్యమానికి ఉద్యోగులు సిద్ధం కావాలన్నారు. జిల్లా కార్యదర్శి పి.సత్యనారాయణ, మండల టీఎన్జీవో అధ్యక్షుడు డి.జగన్, కార్యదర్శి పి.కృష్ణ, కోశాధికారి డి.రవితేజ, జిల్లా నాయకులు సందీప్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, కొమరయ్య పాల్గొన్నారు.

పెరుగుతున్న కిడ్నీ వ్యాధిగ్రస్తులు



వారంలో రెండు నుంచి మూడు సార్లు


వ్యాధి తీవ్రతను బట్టి డయాలసిస్ రోగులకు రెండు నుంచి మూడు రోజుల పాటు డయాలసిస్ చేయాల్సి వస్తుంది. దీంతో కొన్ని ఆసుపత్రుల్లో షిఫ్టుల సంఖ్య పెంచినప్పటికీ సమయం సరిపోకపోవడంతో ఆసుపత్రి సిబ్బంది కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొందరికి వారంలో రెండు నుంచి మూడు రోజుల పాటు డయాలసిస్ చేయాల్సి వస్తుందని, ఒక్క రోగికి 4 నుంచి 5గంటల పాటు రక్తం శుద్ధి చేయాల్సి వస్తుందని ఆసుపత్రి సిబ్బంది చెబుతున్నారు.

- ప్రభుత్వాసుపత్రుల్లో పడకలు సరిపోక ఇబ్బందులు
- సరైన సమయానికి వైద్యం అందక మృత్యువాత

కళ్యాణ్‌నగర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో కిడ్నీ వ్యాధిగ్రస్తులు పెరుగుతున్నారు. ఆహారపు అలవాట్లు, పెరిగిన కాలుష్యంతో పలువురు వ్యాధుల బారిన పడుతున్నారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులకు డయాలసిస్ అవసరం ఉంటుంది. అయితే ప్రభుత్వాసుపత్రిలో సరైన వసతులు లేక రోగుల పరిస్థితి దినదిన గండంగా మారింది. డయాలసిస్ స్థాయికి చేరుకునే రోగులకు సరైన సమయంలో వైద్యం అందక మృత్యువాత పడుతున్నారు. ప్రభుత్వం ఆరు సంవత్సరాల క్రితం డయాలసిస్ సెంటర్లను ఏర్పాటు చేయగా రోగుల సంఖ్య పెరగడంతో సరైన సమయంలో డయాలసిస్ లభించక ఇబ్బందులు పడుతున్నారు.

ఒకప్పుడు కరీంనగర్, వరంగల్, హైదరాబాద్ వంటి ప్రభుత్వాసుపత్రులు, ప్రైవేట్ ఆసుపత్రుల్లో మాత్రమే డయాలసిస్ సెంటర్లు ఉండేవి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత పలు ప్రభుత్వాసుపత్రుల్లో 5 పడకలతో డయాలసిస్ సెంటర్లను ఏర్పాటు చేశారు. ఆరు సంవత్సరాల క్రితం అప్పటి వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డి గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో 5 పడకల డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభించారు. ఇందులో రోజూ నాలుగు షిఫ్టుల్లో 45మంది చికిత్స పొందుతున్నారు. అనంతరం పెద్దపల్లి, మంథని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రుల్లో కూడా డయాలసిస్ కేంద్రాలను అందుబాటులోకి తీసుకువచ్చారు. పెద్దపల్లి ప్రభుత్వాసుపత్రిలో రోజుకు 30మంది, మంథని ప్రభుత్వాసుపత్రిలో 10 మందికి డయాలసిస్ చేస్తున్నారు. ఇదే కాకుండా గోదావరిఖని సింగరేణి ఏరియా ఆసుపత్రిలో రోజుకు 35మందికి డయాలసిస్‌ను చేయిస్తున్నారు. వ్యాధిబారిన పడిన వారి సంఖ్య పెరగడంతో పడకలు సరిపోక ఇబ్బందులు పడుతున్నారు.

వ్యాధిని గుర్తించేలోపే మరణాలు



మధుమేహం వ్యాధి స్టేజ్-3కి చేరుకునే బాధితుల సంఖ్య ఎక్కువైంది. మధుమేహం స్టేజ్-1, 2ల్లో ఉన్న వారు సమయానికి మందులు వాడడం, ఆహారపు అలవాట్లలో మార్పులు చేసుకోవడం వల్ల వ్యాధి తీవ్రత కొంత తగ్గుతున్నప్పటికీ చివరి దశలో వ్యాధిని గుర్తించే సరికి చాలా మంది డయాలసిస్ వరకు వెళ్లాల్సి వస్తుంది. రెండు నెలల క్రితం గోదావరిఖని రాంనగర్‌కు చెందిన చొప్పరి సదానందం అనే యువకునికి కాళ్లు వాపు రావడంతో స్థానిక ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించగా రెండు కిడ్నీలు ఫెయిల్ అయ్యాయని వైద్యులు తెలిపారు. కొద్ది రోజులు హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నారు. వారానికి రెండు రోజులు డయాలసిస్ చేయాల్సి రావడంతో సదానందం గోదావరిఖనిలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి చికిత్స చేయించుకోవడానికి రాగా పడకలు ఖాళీ లేకపోవడంతో మంథని జనరల్ ఆసుపత్రికి వెళ్లాలని వైద్యులు సూచించారు. అక్కడ కూడా బెడ్లు లేకపోవడంతో పెద్దపల్లికి వెళ్లాలని వైద్యులు సూచించడంతో అక్కడి నుంచి పెద్దపల్లి వెళ్లాడు.

అక్కడ కూడా డయాలసిస్ చేయడం కుదరదని వైద్యులు చెప్పడంతో ఇంటికి వచ్చిన సదానందం రెండు రోజులకే మృతి చెందాడు. కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి మండలానికి చెందిన నారాయణ అనే వృద్ధుడు మంచిర్యాలలో డయాలసిస్ కేంద్రానికి రాగా అక్కడ ఖాళీ లేకపోవడంతో గోదావరిఖని జనరల్ ఆసుపత్రికి వచ్చాడు. అక్కడ కూడా బెడ్లు దొరకకపోవడంతో పెద్దపల్లికి వెళ్లాలని సూచించడంతో చివరికి కరీంనగర్ ప్రైవేట్ ఆసుపత్రిలో చేయించుకున్నాడు.



పెరిగిన కిడ్నీ బాధితులు
రాజశేఖర్‌రెడ్డి, సూపరింటెండెంట్, మంథని

వాతావరణ కాలుష్యం, మితి మీరిన ఆహారం, నీటి కాలుష్యంతో కిడ్నీ బాధితుల సంఖ్య పెరుగుతుంది. వందలో సుమారు 40మంది బార్డర్ లైన్‌లో మధుమేహ వ్యాధికి గురవుతున్నారు. కొందరు షుగర్, బీపీ ఉన్న వారికి కిడ్నీలపై ప్రభావం చూపడంతోపాటు మితిమీరిన ఆహారం తీసుకోవడం, సరైన నిద్రలేకపోవడం, నిత్యం మానసిక ఒత్తిడికి గురి కావడంతో కిడ్నీ వ్యాధుల బారిన పడుతున్నారు. ఆహార అలవాట్లను నియంత్రించుకోవాలి. రోజూ వ్యాయామం చేయాలి. యోగా, నడకపై దృష్టి పెట్టాలి.


డయాలసిస్ సెంటర్‌లో చికిత్స పొందుతున్న రోగులు

ఉపాధ్యాయ పెండింగ్ బిల్లులను మంజూరు చేయాలి

డీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ సత్యనారాయణ

గంభీరావుపేట, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులకు సంబంధించి ఏడాదిగా పెండింగ్‌లో ఉన్న అన్ని బిల్లులను ప్రభుత్వం విడుదల చేయాలని డీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ ఎర్ర సత్యనారాయణ డిమాండ్ చేశారు. గంభీరావుపేట మండల కేంద్రంలో డీటీఎఫ్ సభ్యత్వ నమోదులో భాగంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సత్యనారాయణ మాట్లాడారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు, జీపీఎఫ్ పార్ట్ ఫైనల్‌లోన్లు, టీజీఐఎల్‌సీలోన్లు, రిటైర్మెంట్ బెనిఫిట్‌లతో పాటు పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం జరుగుతున్న ప్రమోషన్లలో మొదట గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులను బదిలీ చేసి, తరువాత ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. పీఎస్ హెచ్‌ఎం ప్రమోషన్లలో బీఈడీ, డీఈడీలలో కామన్ సీనియార్టీ ఆధారంగా ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో డీటీఎఫ్ మండల అధ్యక్షుడు శీల కుమార్, మండల ప్రధాన కార్యదర్శి దోసల మధు, డీటీఎఫ్ జిల్లా కౌన్సిలర్లు కుమ్మరవేణి శ్రీనివాస్, ఎం దేవేంద్రం, కార్యదర్శులు శ్రీకాంత్‌రెడ్డి, చీకట్ల రాజు, సభ్యులు శ్రీశైలం ఉన్నారు.

మాల కులస్థులకు ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి

ఇల్లందకుంట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మాల కులస్థులకు హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి మాదాసు మొగిలి అన్నారు. మంగళవారం ఇల్లంద కుంట పోలీస్‌స్టేషన్లో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కన్నమదాసు తల భాగంలో కౌశిక్‌రెడ్డి తల ఫొటో పెట్టి మాల కన్నమదాసును, మాలలను అవమానపరుస్తూ, మనోభావాలను దెబ్బతీసే విధంగా సోషల్ మీడియాలో పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వెంటనే ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా శీత్లా భవాని వేడుకలు


పెగడపల్లిలో నిర్వహించిన వేడుకల్లో గిరిజన మహిళలు

పెగడపల్లి, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : పెగడపల్లి మండలంలోని ఏడుమోటలపల్లి తండాలో మంగళవారం శీత్లా భవాని వేడుకలు ఘనంగా నిర్వహించారు. వర్షాకాలంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు బాగా పండాలని గిరిజన మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రవినాయక్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తిరుపతి నాయక్, బాలు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

- **వీర్నపల్లి** : మండలంలోని తండాల్లో శీత్లా భవాని వేడుకలు ఘనంగా నిర్వహించారు. నైవేద్యాలు, మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి గద్దెల వద్ద గిరిజనులు సాంప్రదాయ దుస్తుల్లో నృత్యాలు చేశారు. బంజార సంఘం జిల్లా అధ్యక్షుడు గుగులోతు సురేష్ నాయక్ పాల్గొన్నారు. బాబాయిచెర్వు తండాలో జరిగిన వేడుకల్లో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శేషాద్రి, ఎంపీడీవో అబ్దుల్ వాజీద్, ఏపీవో శ్రీహరితో కలిసి పాల్గొన్నారు. అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. గిరిజనులు నృత్యాలతో వారికి స్వాగతం పలికారు.


వీర్నపల్లి పూజలు నిర్వహిస్తున్న గిరిజన నాయకులు

ముంపు గ్రామాల సమస్యలకు శాశ్వత పరిష్కారం

- కొత్త సంవత్సరంలోగా ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలి
- 847 మంది నిర్వాసితులకు ఇందిరమ్మ ఇళ్ల పత్రాల పంపిణీ
- వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్


ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, రాజన్న సిరిసిల్ల కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

వేములవాడ టౌన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మిడ్ మానేరు రిజర్వాయర్ ముంపు గ్రామల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతున్నామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ మండలం అగ్రహారం శ్రీకన్వెన్షన్‌లో మంగళవారం కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాతో కలిసి నిర్వసితులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ మిడ్ మానేరు రిజర్వాయర్‌లో ముంపునకు గురైన నిర్వాసితులు ఇళ్లు కట్టుకోకుండా ఖాళీ ప్లాట్స్ ఉన్న వారికి స్పెషల్ కోటా కింద 847 మంది నిర్వసితులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని అన్నారు. ప్రజా ప్రభుత్వంలో 4 లక్షల 50 వేల ఇందిరమ్మ ఇళ్ల మొదటి విడతలో మంజూరు చేశామని, వీటితో వేములవాడ నియోజకవర్గానికి కేటాయించిన 3500 ఇందిరమ్మ ఇళ్లను ఇప్పటికే పంపిణీ చేశామని, స్పెషల్ కోటా కింద మిడ్ మానేరు నిర్వసితలుకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామన్నారు.

మరో 3 వేల ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులు పెండింగ్‌లో విచారణలో ఉన్నాయని, ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, త్వరలో మిగిలిన వారికి తప్పని సరిగా మంజూరు చేస్తామన్నారు. అర్బన్ మండలంలో ముంపు గ్రామాల నిర్వాసితులకు తప్పనిసరిగా ఇళ్లు మంజూరు అవుతాయన్నారు. నిర్వాసితులకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. దశంలో ఎక్కడ కూడా పేదలకు ఇంటి నిర్మాణం కోసం రూ. 5 లక్షలు ఇవ్వడం లేదని, రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రంలోనే సాధ్యమైందని వివరించారు. రూ.76కోట్లతో రాజన్న ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, ఈ పనులకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ ప్రస్తుతం జరుగుతుందన్నారు. ధనిక రాష్ట్రం తెలంగాణను గత పాలకులు అప్పుల కుప్పగా మార్చి ఆర్థిక వ్యవస్థను విధ్వంసం చేశారని ధ్వజమెత్తారు.

ఆర్థికంగా రాష్ట్రం ఇబ్బందులు పడుతున్నప్పటికీ గత పాలకుల హయాంలో ప్రారంభించిన పథకాలను కొనసాగిస్తూనే ఎన్నికల సమయంలో ఇచ్చిన మేరకు ఒక్కో హామీ అమలు చేస్తున్నామన్నారు. అనంతరం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక కృషితో స్టేట్ రిజర్వు బ్యాంకు నుంచి మొదటి సారిగా 5 వేల ఇందిరమ్మ ఇళ్లను ఇప్పించారన్నారు. ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు 4 దశల్లో రూ. 5 లక్షల ఆర్థిక సహాయం అందుతుందని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం 400 నుంచి 600 చదరపు గజాలలోపు మాత్రమే నిర్మించాలన్నారు. తల్లిదండ్రులు చనిపోయిన పిల్లలకు ఇళ్లు వచ్చేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పిల్లి కనుకయ్య తదితరులు ఉన్నారు.

ఘాట్‌రోడ్డు అపరిశుభ్రత



మల్యాల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఘాట్‌రోడ్డుకు ఇరువైపులా అపరిశుభ్రత దర్శనం ఇస్తోంది. ప్లాసిక్ కవర్లు, తాగి పడేసిన వాటర్ బాటిళ్లు తదితర వ్యర్థాలతో ఘాట్‌రోడ్డుపై నడిచి వెళ్లే భక్తులు ఇబ్బంది పడుతున్నారు. నిత్యం కొండపైన పదుల సంఖ్యలో షిఫ్ట్ పద్ధతిలో పారిశుధ్య సిబ్బంది విధులు నిర్వహిస్తున్నప్పటికీ ఘాట్‌రోడ్డు దిగువ నుంచి వైజంక్షన్ వరకు అపరిశుభ్రత కొట్టొచ్చిన్నట్లు కనిపిస్తోంది.


కొండగట్టు ఘాట్‌రోడ్డు పక్కన ప్లాస్టిక్ వ్యర్థాలు

ముగిసిన పోలీస్ డ్యూటీ మీట్

విజేతలకు పతకాలు అందజేత



విజేతలతో కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం

కరీంనగర్ క్రైం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): పోలీస్ కమిషనరేట్ కేంద్రంగా కరీంనగర్‌లో జరుగుతున్న రాజన్న జోన్-3 స్థాయి తెలంగాణ స్టేట్ పోలీస్ డ్యూటీ మీట్ పోటీలు మంగళవారం ముగిశాయి. ఈ డ్యూటీ మీట్‌లో ప్రధానంగా ఆరు విభాగాల్లో పోటీలు నిర్వహించారు. అవి సైంటిఫిక్ ఎయిడ్స్ టు ఇన్వెస్టిగేషన్, యాంటీ సబాటేజ్ చెక్, కంప్యూటర్ అవేర్నెస్ కాంపిటీషన్, డాగ్ స్క్వాడ్ కాంపిటీషన్, పోలీస్ ఫొటోగ్రఫీ, పోలీస్ వీడియోగ్రఫీ. వీటిల్లో విజేతలుగా నిలిచిన వారిని ఎంపిక చేసి వరంగల్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి డ్యూటీ మీట్ పోటీలకు పంపించనున్నారు. ఈ పోటీల్లో మెదక్, సిద్ధిపేట, కామారెడ్డి జిల్లాల పోలీసులు పలు విభాగాల్లో పతకాలు సాధించారు.

విభాగాల వారీగా డ్యూటీ మీట్ పోటీల్లో విజేతలు:

- సైంటిఫిక్ ఎయిడ్స్ టు ఇన్వెస్టిగేషన్ విభాగంలో ఫోరెన్సిక్ సైన్స్ రాత పరీక్షలో కరీంనగర్ కమిషనరేట్ గంగాధర పోలీసుఠాణాలో పని చేస్తున్న ఎస్ఐ వంశీకృష్ణ బంగారు పతకం సాధించారు. శంకరపట్నం పోలీసు ఠాణా ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న శేఖర్‌రెడ్డి కాంస్య పతకం సాధించారు.
- క్రైమ్ ఇన్వెస్టిగేషన్ అండ్ క్రిమినల్ చట్టాల విభాగంలో కమిషనరేట్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న జి నరేందర్‌రెడ్డి వెండి పతకం సాధించారు.
- మెడికల్ లీగల్ టెస్ట్ విభాగంలో కరీంనగర్ కమిషనరేట్ చొప్పదండి సీఐ ఏ ప్రదీప్‌కుమార్ బంగారు పతకం సాధించగా, గంగాధర పోలీసు ఠాణా ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న వంశీకృష్ణ కాంస్య పతకం సాధించారు.
- లిఫ్టింగ్ అండ్ ప్యాకింగ్ ఆఫ్ ఎగ్జిబిట్స్ పరీక్షలో కమిషనరేట్ చెందిన ఎస్ఐ యూనస్‌కు వెండి పతకం సాధించారు.
- ఫింగర్ ప్రింట్ సైన్స్‌లో కరీంనగర్ కమిషనరేట్‌కు చెందిన ఎస్ఐ యూనస్ గోల్డ్ మెడల్, కమిషనరేట్‌కు చెందిన ఎస్ఐ బి వంశీకృష్ణ బ్రాంజ్ మెడల్ సాధించారు.
- క్రైమ్ సీన్ ఫొటోగ్రఫీ పరీక్షలో కమిషనరేట్ ఎస్సై ఎస్ఐ యూనస్ వెండి పతకం, రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన ఎస్ఐ సీహెచ్ గణేష్ కాంస్య పతకాలను సాధించారు.
- పోలీస్ పోర్ట్రైట్ పరీక్షల్లో రాజన్న సిరిసిల్ల జిలాకు చెందిన పోలీస్ కానిస్టేబుల్ ప్రసన్న కుమార్ గోల్డ్ మెడల్ సాధించారు.
- యాంటీ సాబెటేజ్ చెక్‌లో గ్రౌండ్ సర్చ్‌లో కరీంనగర్ కమిషనరేట్‌కు చెందిన వి సంతోష్, వి వెంకటేష్ కానిస్టేబుల్ గోల్డ్ మెడల్ సాధించారు.
- రూమ్ సర్చ్‌లో రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన కానిస్టేబుళ్లు ఎం శ్రవణ్ కుమార్, జి కిరణ్ కుమార్‌లు బంగారు పతకం సాధించగా, కరీంనగర్ కమిషనరేట్‌కు చెందిన కానిస్టేబుళ్లు ఇ చంద్రమోహన్, బి కిరణ్ కుమార్ సిల్వర్ మెడల్ సాధించారు.
- వెహికల్ సెర్చ్‌లో కమిషనరేట్‌కు చెందిన ఎస్.ఎస్ శ్రీనివాస్, విరాజులకు బ్రాంజ్ మెడల్స్ దక్కాయి.
- యాక్సెస్ కంట్రోల్‌లో కమిషనరేట్‌కు చెందిన పోలీస్ కానిస్టేబుల్ టి రమేష్, ఏ మహేష్‌లకు సిల్వర్ మెడల్ సాధించారు.
- డాగ్ స్క్వాడ్ కాంపిటీషన్‌లో రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన డాగ్ హ్యాండ్లర్, పోలీస్ కానిస్టేబుల్ జి శ్రీనివాస్ సిల్వర్ మెడల్ సాధించాడు.
- నార్కోటిక్‌లో కరీంనగర్ కమిషనరేట్ చెందిన ఏ శంకర్ సిల్వర్ మెడల్ సాధించారు.
- కంప్యూటర్ అవేర్నెస్ కాంపిటీషన్‌లో కంప్యూటర్ అవేర్నెస్, ఆబ్జెక్టివ్ టెస్ట్‌లో కరీంనగర్ కమిషనరేట్‌కు చెందిన పోలీస్ కానిస్టేబుల్ ఏం సతీష్ కుమార్ సిల్వర్ మెడల్ బ్రాంజ్ మెడల్ సాధించారు.
- ఆఫీస్ ఆటోమేషన్‌లో కరీంనగర్ కమిషనరేట్‌కు చెందిన జి అనిల్ కుమార్ సిల్వర్ మెడల్ సాధించారు.
- ప్రోగ్రామింగ్ ఎబిలిటీలో కరీంనగర్ కమిషనర్‌కు చెందిన ఫోరెన్సిక్ ల్యాబ్ కానిస్టేబుల్ జి సంతోష్ కుమార్ గోల్డ్ మెడల్ సాధించారు.
- పోలీస్ ఫొటోగ్రఫీ విభాగంలో కరీంనగర్ కమిషనరేట్‌కు చెందిన పోలీస్ కానిస్టేబుల్ మల్లేశం బ్రాంజ్ మెడల్ సాధించారు.
- క్రైమ్ సీన్ అబ్జర్వేషన్ విభాగం రాత, ప్రాక్టికల్ పరీక్ష పోటీలలో కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లో మహిళా పోలీసుఠాణాలో పనిచేస్తున్న పోలీస్ కానిస్టేబుల్ పి కిషోర్‌గౌడ్ గోల్డ్ మెడల్ సాధించగా, కమిషనరేట్‌లోని రూరల్ పోలీసు ఠాణాలో పని చేస్తున్న పోలీస్ కానిస్టేబుల్ ఎస్ రాజ్‌కుమార్‌కు సిల్వర్ మెడల్ సాధించారు.

ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ వెంకట రమణ, అడిషనల్ డీసీపీ (ఏఆర్) భీం రావు, ఏసీపీలు విజయ్ కుమార్, వేణుగోపాల్ ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పరిహారం అందలేదని రోడ్డుపై బైఠాయించిన రైతులు

శంకరపట్నం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేశవపట్నం శివారులో జాతీయ రహదారి బైపాస్ రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు పరిహారం రాలేదని మంగళవారం బైపాస్ రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా రైతులు మ్యాకల కొంరయ్య, సముద్రాల చంద్రయ్య మాట్లాడుతూ కేశవపట్నం శివారులో సర్వే నంబర్ 73లో ఒక్కొక్కరికి 14 గుంటల చొప్పున మొత్తం 28 గుంటల భూమి ఎన్‌హెచ్-563 బైపాస్ రోడ్డు నిర్మాణంలో పోయిందన్నారు. రెండేళ్లు గడుస్తున్నా తమకు పరిహారం అందలేదని ఆవేదన చెందారు. ఇప్పటికే ఆ స్థలంలో రోడ్డు నిర్మాణం పూర్తయిందన్నారు. సంబంధిత శాఖాధికారుల చుట్టూ తిరిగిన ఫలితం లేదన్నారు. బైపాస్ రోడ్డుపై బైఠాయించి జాతీయ రహదారి నిర్మాణ సంస్థ వాహనాలను అడ్డుకున్నారు. సమాచారం తెలుసుకున్న తహసీల్దార్ సురేఖ సంఘటన స్థలానికి చేరుకొని రైతులతో మాట్లాడి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.


కేశవపట్నంలో రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేస్తున్న రైతులు

● సంక్షిప్తంగా..

గణేశ్‌నగర్: విద్యుత్ ఆదా కోసం ఆటోమేటికల్లీ పవర్ ఫ్యాక్టర్ కంట్రోల్ (ఏపీఎఫ్‌సీ) పెట్టుకోవాలని కరీంనగర్ జిల్లా పర్యవేక్షక ఇంజనీరు మేక రమేష్ బాబు సూచించారు. మంగళవారం కరీంనగర్ సర్కిల్ కార్యాలయంలో ఎచ్‌టీ కన్స్యూమర్లతో సమావేశం నిర్వహించారు.

కరీంనగర్ కల్చరల్: ఆషాఢమాసం సందర్భంగా నగరంలోని సరస్వతీ శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో మంగళవారం గోరింటాకు మహోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రాజమౌళి, కార్యదర్శి కోల అన్నారెడ్డి పాల్గొన్నారు.

కరీంనగర్ రూరల్: నగునూర్ గ్రామ శివారులోని శ్రీ దుర్గా భవానీ ఆలయంలో జరుగుతున్న ఆషాఢ మాసం శాకంబరీ ఉత్సవాల్లో భాగంగా మంగళవారం శ్రీదుర్గా భవానీ అమ్మవారిని గోరు గుండు దోసకాయల మాలలతో అలంకరించారు.

గంగాధర: మండల కేంద్రంలోని ప్రజాకార్యాలయంలో మండలానికి చెందిన వివిధ గ్రామాల లబ్ధిదారులకు మంజూరైన 6.40లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను మార్కెట్ కమిటీ చైర్మన్ జాగిరపు రజితశ్రీనివాస్‌రెడ్డి పంపిణీ చేశారు.

శంకరపట్నం: మండలంలోని మొలంగూర్ గ్రామంలో మంగళవారం రాత్రి ఉర్సు వేడుకలు ఘనంగా జరిగాయి. గ్రామంలోని మలంగ్‌షావలి దర్గా వద్ద కులమతాలకతీతంగా మహిళలందరూ ప్రత్యేక పూజలు చేశారు. మొలంగూర్ ఖిల్లా మీద దీపం వెలిగించేందుకు ఖిల్లా పైకి జనం బారులు తీరారు. కేశవపట్నం ఎస్‌ఐ శేఖర్‌రెడ్డిని మైనార్టీ నాయకులు సన్మానించారు.

వీణవంక: మండల కేంద్రంతో పాటు ఎల్బాకలో స్వచ్ఛ సర్వేక్షణ్ టీమ్ సభ్యులు మంగళవారం సందర్శించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీధర్, ఎంపీవో సురేందర్‌కుమార్, రమేష్, వేణు, రాణి, రజిత, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

- వీణవంక మండలంలోని రెడ్డిపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

- వీణవంక మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ జన్మదిన సందర్భంగా బుధవారం సైకిళ్లను పంపిణీ చేస్తున్నట్లు బీజేపీ మండలాధ్యక్షుడు బత్తిని నరేష్‌గౌడ్ తెలిపారు.

భగత్‌నగర్: సీపీఐ సీనియర్ నాయకుడు మాజీ ఎంపీపీ వేముల వెంకట్రాజం మృతి పార్టీకి తీరని లోటని సీపీఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ అన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా వైఎస్సార్ జయంతి

కరీంనగర్ అర్బన్, జూలై 8(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ వైయస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలను కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. డీసీసీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి నగర కాంగ్రెస్ అధ్యక్షులు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆరేపల్లి మోహన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రెహమత్ హుస్సేన్, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డితో పాటు పలువురు నాయకులు హాజరై వైఎస్‌ఆర్ చిత్రపటానికి పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులు అర్పించారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతులకు రుణమాఫీతో పాటు ఉమ్మడి కరీంనగర్ జిల్లా అభివృద్ధికి వైఎస్‌ఆర్ ఎంతో కృషి చేశారన్నారు. సీనియర్ కాంగ్రెస్ నాయకులు బొబ్బిలి విక్టర్ ఆధ్వర్యంలో సీఎస్‌ఐ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

హుజూరాబాద్ : హుజూరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని బోర్నపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి మంగళవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సందమల్ల నరేష్, కొత్తగట్టు చక్రపాణి, సందమల్ల బాబు, దుబాసి బాబు, రాఘవేంద్ర, భిక్షపతి, శ్రీకాంత్, అనిల్, ఓదెలు, రమేష్ పాల్గొన్నారు.

ఇల్లందకుంట: ఇల్లందకుంట మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు పెద్ది కుమార్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో నాయకులు రామారావు, సంపత్, రామకృష్ణ, రమేష్, మహేష్, శివకుమార్, ప్రశాంత్, పరమేశ్వర్, చిరంజీవి, మల్లేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్‌కు నివాళులర్పిస్తున్న కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, ఆరెపల్లి మోహన్

చొప్పదండి: మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరి మహేష్, పార్టీ పట్టణ అధ్యక్షుడు నిజానపురం చందు, జిల్లా ప్రధానకార్యదర్శి పెరుమాండ్ల గంగయ్యగౌడ్ పాల్గొన్నారు.

సైదాపూర్: మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

చదరంగంతో మేధస్సుకు పదును

కరీంనగర్ స్పోర్ట్స్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల మేధస్సుకు చదరంగం క్రీడ పదును పెడుతుందని, చదరంగంలో రాణించిన విద్యార్థులు అన్ని రంగాల్లో రాణిస్తారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. కరీంనగర్ వేదికగా జీనియస్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 12, 13 తేదీల్లో జరగనున్న 3వ ఆలిండియా జూనియర్ చెస్ పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన కరీంనగర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరీంనగర్ లో జరగనున్న ఆలిండియా పోటీలను అట్టహాసంగా నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు. 3వసారి ఆలిండియా చెస్ పోటీలను నిర్వహిస్తున్నట్లు జీనియస్ చెస్ అకాడమీ కోచ్, డైరెక్టర్ కంకటి అనూప్ కుమార్ తెలిపారు. పోటీలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని పోటీలను స్విస్ లీగ్ పద్ధతిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జీనియస్ చెస్ అకాడమీ బాధ్యులు కంకటి సృజన్, మల్లేశం, లింగంపల్లి రవిచంద్ర, తోట సాగర్, దేవరకొండ సునీల్ తదితరులు పాల్గొన్నారు.



చెస్ పోటీల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్

సమ్మెకు బీఎంఎస్‌ఆర్‌ఏ దూరం

సుభాష్‌నగర్, జూలై 8(ఆంధ్రజ్యోతి): రాజకీయ ప్రేరేపిత సమ్మెకు తాము దూరంగా ఉంటున్నామని భారతీయ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పప్పుల సురేష్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం కరీంనగర్ ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ ఎనమల్ల నరేష్‌ను కలిసి మెడికల్ రిప్స్‌కు యదావిధిగా డాక్టర్ కాల్స్ ఇవ్వాలని వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను ప్రవేశపెట్టగా బీఎంఎస్ కార్మికుల సంక్షేమం కోసం రెండింటిని స్వీకరించి, మరో రెండింటిని వ్యతిరేకిస్తుందన్నారు. కొన్ని సంఘాలు గుడ్డిగా అన్ని కోడ్‌లను వ్యతిరేకిస్తున్నాయని దుయ్యబట్టారు. కార్మికుల అభివృద్ధి కోసం బీఎంఎస్ పోరాటం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాదాసు విక్రమ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీని తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో

చొప్పదండి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రాజగోపాల్‌రావుతో కలిసి మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అటెండెన్స్ రిజిస్టర్, అవుట్ పేషెంట్ రిజిస్టర్, ఇతర రికార్డులను పరిశీలించారు. ఆరోగ్య కేంద్రం పరిశుభ్రతను పరిశీలించి అన్నివేళల్లో పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీవోఎంహెచ్ఎన్ డాక్టర్ సన జవేరియా, చొప్పదండి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సురేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

● గంగాధర: ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని విధుల్లో నిర్లక్ష్యం వహించవద్దని డిప్యూటీ డీఎంహెచ్‌వో రాజ్‌గోపాల్‌రావు సూచించారు. మంగళవారం ఆయన గంగాధర పీహెచ్‌సీని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ల్యాబ్, ఫార్మసీని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో విధి నిర్వహణలో వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. పల్లెల్లో సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారి శ్వేత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



గంగాధర పీహెచ్‌సీలో పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో రాజ్‌గోపాల్‌రావు

బీఎల్‌వోలు క్షేత్రస్థాయిలో ప్రతి ఇంటినీ సందర్శించాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి

చొప్పదండి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కొత్త ఓటర్ల నమోదు సందర్భంగా బూత్ స్థాయి అధికారులు ప్రతి ఇంటిని సందర్శించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి అన్నారు. మంగళవారం చొప్పదండిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన బూత్ లెవల్ అధికారుల శిక్షణ కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొత్తగా ఓటర్లను నమోదు చేసే సమయంలో, ఓటర్లను జాబితా నుంచి తొలగించే సందర్భంలో అత్యంత జాగ్రత్తతో వ్యవహరించాలని అన్నారు. ఫారం-6, 7, 8 పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని, అర్హత ఉన్న ఏ ఒక్క ఓటరు ఓటు హక్కు లేకుండా ఉండరాదని తెలిపారు. బీఎల్‌వోలు క్షేత్రస్థాయిలో సందర్శిస్తూ పూర్తి ఆధారాలతో ఎప్పటికప్పుడు ఓటర్ల నమోదు, తొలగింపు చేపట్టాలని అన్నారు. కొత్తగా వచ్చిన నిబంధనలు, మార్పులు, సడలింపులపై ఎప్పటికప్పుడు అవగాహనతో ఉండాలన్నారు. అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, ఎంపీడీవో వేణుగోపాల్‌రావు, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీవో రాజగోపాల్‌రెడ్డి, ఎలక్షన్ సెల్ డీటీ మనోజ్, బీఎల్‌వోలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

పింఛన్ కోసం ఎదురుచూపులు

కరీంనగర్ రూరల్, జూలై 8(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నుంచి ఆసరా పింఛన్లను చేయూత పేరిట మార్పు చేసినప్పటికీ కొత్త లబ్ధిదారులకు ఒక్కరికి కూడా పింఛన్ అందించలేదు. కరీంనగర్ మండలంలో మొత్తం 3,180 మందికి ఆసరా పింఛన్లు అందుతున్నాయి. నాలుగు సంవత్సరాల నుంచి కొత్త పింఛన్లు మంజూరు చేయకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. వృద్ధాప్య, వికలాంగులు, వితంతు పింఛన్ల కోసం దరఖాస్తులు పెట్టుకుని ఎదురు చూస్తున్నారు. మండలంలో 650మందికి పైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం అర్హులైన వారికి పింఛన్లు అందించాలని కోరుతున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పింఛన్లు వెయ్యి రూపాయలు పెంచి అందజేస్తామని హామీ ఇచ్చినా అమలుకు నోచుకోవడం లేదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిరుద్యోగులకు శిక్షణ, ఉపాధి

శంకరపట్నం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో దీన్ దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌసల్య యోజనలో భాగంగా మండలంలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఈ నెల 10నుంచి ఉపాధి శిక్షణ ప్రోగ్రాం ఎంపీడీవో కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీవో ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి, యూనిఫామ్స్, స్టడీ మెటీరియల్, మూడు వేల రూపాయల భృతి, సర్టిఫికెట్ అందజేయనున్నట్లు తెలిపారు. ప్రముఖ కార్పొరేట్ కంపెనీల్లో ఉద్యోగ అవకాశం కల్పిస్తామని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు, రేషన్‌కార్డు, ఆధార్‌కార్డులతో ఈ నెల 10న ఉదయం 10గంటలకు హాజరు కావాలని పేర్కొన్నారు. సంబంధిత వివరాలకు ఫోన్ 9849131050, 9642141539 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

అంధుల ఆశ్రమ పాఠశాలలో నరేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలు

భగత్‌నగర్, జులై 8(ఆంధ్రజ్యోతి): రేకుర్తిలోని అంధుల ఆశ్రమ పాఠశాలలో అల్ఫోర్స్ అధినేత డాక్టర్ వి నరేందర్ రెడ్డి జన్మదిన వేడుకలను బీసీ విద్యార్థి సంఘం ఉమ్మడి జిల్లా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం రేకుర్తిలోని అంధుల ఆశ్రమ పాఠశాలలో నరేందర్ రెడ్డి పాల్గొని మొక్కలు నాటారు. అనంతరం బీసీ విద్యార్థి సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సిరిశెట్టి రాజేష్ గౌడ్ నిర్వహించిన జన్మదిన వేడుకల్లో కేక్ కట్ చేసి విద్యార్థులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో అనాథ వృద్ధుల ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



అంధుల పాఠశాలలో కేక్ కట్ చేస్తున్న నరేందర్‌రెడ్డి

యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో...

కరీంనగర్ అర్బన్/గణేశ్‌నగర్: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మెన్ వుటుకూరి నరేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలు యూత్ కాంగ్రెస్ కరీంనగర్ జిల్లా వైస్ ప్రెసిడెంట్స్ ఫహద్, గుర్రంవాసుల ఆధ్వర్యంలో తెలంగాణ చౌక్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే విద్యారంగంలో కరీంనగర్‌ని గర్వపడేలా చేసిన వ్యక్తి నరేందర్‌రెడ్డి అని అన్నారు. కార్యక్రమంలో ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షుడు కొరివి అరుణ్, ఎస్‌టి సెల్ జిల్లా అధ్యక్షుడు శ్రావణ్‌నాయక్, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శులు తాళ్లపెల్లి శ్రీకాంత్, బత్తిని విష్ణు, కరీంనగర్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు ఓరుగంటి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

కమాన్‌పూర్‌లో రైతు నేస్తం

భగత్‌నగర్, జులై 8(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలంలోని కమాన్‌పూర్ రైతు వేదికలో వ్యవసాయాధికారులు మంగళవారం రైతు నేస్తం కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వ్యవసాయ అధికారి కే భాగ్యలక్ష్మి కమాన్‌పూర్ రైతు వేదికలో రైతులతో పాటు పాల్గొన్నారు. రైతులందరూ విధిగా ఫార్మర్ రిజిస్ట్రీలో తమ ఆధార్ కార్డులు ఆధారంగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. కొత్తపెల్లి మండలంలోని పలు ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో కరీంనగర్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు కె రణధీర్ కుమార్, మండల వ్యవసాధికారి ఎం కృష్ణ ఉన్నారు.

ఎరువుల దుకాణం తనిఖీ

చొప్పదండి: పట్టణంలోని ఎరువుల దుకాణాలను అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే మంగళవారం తనిఖీ చేశారు. ఎరువుల దుకాణాల్లోని రిజిస్టర్లను, ఎరువుల స్టాక్‌ను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో ఏవో వంశీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఐసెట్ ఫలితాల్లో వివేకానంద విద్యార్థుల ప్రతిభ

గణేశ్‌నగర్,జూలై 8(ఆంధ్రజ్యోతి): ఐసెట్ 2025 ఫలితాలలో వివేకానంద డిగ్రీ పీజీ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్.సిఎచ్ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు, బీబీఏ విద్యార్థి బత్తిని రాకేష్ 376, బీఎస్సీ డేటా సైన్స్ విద్యార్థి అనుమల్ల శ్వేతన్ కుమార్ 378వ ర్యాంకు సాధించారని తెలిపారు. విద్యార్థులను కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ ఆగంరావు, ప్రిన్సిపల్ సీఎచ్. శ్రీనివాస్, అకాడమిక్ కోఆర్డినేటర్ బి.సంపత్ కుమార్, బి. శ్రవణ్‌కుమార్ అభినందించారు.

డబుల్ రోడ్డు గురించి మాట్లాడే హక్కు రసమయికి లేదు

గన్నేరువరం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): గన్నేరువరం మండలాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసేది కాంగ్రెస్ పార్టీ అని, మండల డబుల్ రోడ్డు గురించి మాట్లాడే నైతిక హక్కు మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌కు లేదని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో మాట్లాడారు. జిల్లా నాయకుడు కొమ్మెర రవీందర్ రెడ్డి మాట్లాడుతూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను సోమవారం కలువగా డబుల్ రోడ్డు కోసం నిధుల మంజూరుకు ఆదేశించారని తెలిపారు. కార్యక్రమంలో కేడీసీసీ డైరెక్టర్ అలువాల కోటి, ముస్కు ఉపేందర్‌రెడ్డి, నాయకులు జువ్వాడి మన్‌మోహన్‌రావు, బొడ్డు సునీల్, చిట్కూరి అనంతరెడ్డి పాల్గొన్నారు.

నేటి సార్వత్రిక సమ్మెకు సంఘాల మద్దతు

గణేశ్‌నగర్,జూలై 8(ఆంధ్రజ్యోతి): దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ ప్రైవేటీకరించే దిశగా అడుగులు వేస్తున్న కేంద్ర ప్రభుత్వ చర్యలను నిరసిస్తూ జాతీయ విద్యుత్ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి పిలుపు మేరకు జులై 9వ తేదీన దేశవ్యాప్త విద్యుత్ ఉద్యోగుల విధుల బహిష్కరణకు పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా మంగళవారం కరీంనగర్ సర్కిల్ ఆఫీస్ ఆవరణలో జరిగిన సమావేశంలో విద్యుత్ జేఏసీ నాయకులు మాట్లాడుతూ అత్యవసర సర్వీసులు మినహా అన్ని రకాల పనులు బహిష్కరిస్తామని విద్యుత్ వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు. జేఏసీ నాయకులు అంజయ్య, భాస్కర్, శ్రీనివాస్, సంపత్ కుమార్, రమేష్, కిరణ్, రఘు శ్రీనివాస్, సవాయి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సుభాష్‌నగర్ : ట్రేడ్ యూనియన్లు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 9న తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు మద్దతు తెలుపుతున్నట్లు తెలంగాణ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి టి రామారావు తెలిపారు. మంగళవారం జిల్లా జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వీరారెడ్డికి సమ్మె నోటీసు అందచేశారు. కార్యక్రమంలో యూనియన్ జీజీహెచ్ బ్రాంచి అధ్యక్షుడు సన్ని ఎడ్వర్డ్, ప్రధానకార్యదర్శి దేవరాజ్ పాల్గొన్నారు.

శంకరపట్నం: ఈ నెల 9న జరగబోయే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు తెలంగాణ రైతు సంఘం మద్దతు తెలుపుతుందని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వర్ణ వెంకట్‌రెడ్డి అన్నారు. మంగళవారం శంకరపట్నం మండల కేంద్రంలో వర్ణ వెంకట్‌రెడ్డి, కార్యదర్శి వెల్మారెడ్డి రాజిరెడ్డి మాట్లాడారు.

12న డబుల్ రోడ్డు కోసం బైక్ ర్యాలీ : రసమయి

గన్నేరువరం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం నుంచి గుండ్లపల్లి స్టేజీ వరకు డబుల్ రోడ్డు కోసం బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 12న బైక్ ర్యాలీ చేపట్టనున్నట్టు మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ తెలిపారు. మంగళవారం మండలంలోని ఖాసింపేటలో బైక్ ర్యాలీ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. బైక్ ర్యాలీలో మండల ప్రజలు, యువత భారీగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. మానేరు డ్యాంలో చేపలవేటకు వెళ్లి మృతి చెందిన మైలారం గ్రామానికి చెందిన గువ్వ రవి కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు.

మొక్కలు, విత్తనాల పంపిణీ

మానకొండూర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నారం గ్రామంలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం ప్రేరణ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మొక్కలు, కూరగాయల విత్తనాలను పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు సుదర్శనం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భూముల విలువ పెంపు

(5వ పేజీ తరువాయి)

రిజిస్ట్రేషన్ ఫీజు 0.5 శాతంఉంది. మ్యుటేషన్ ఫీజు మున్సిపాలిటీల్లో మూడు వేలు, గ్రామపంచాయతీల్లో 800 రూపాయలు ఉంది. యూజర్ చార్జీల కింద 500 రూపాయలు వసూలు చేస్తున్నారు. గిఫ్ట్‌డీడ్‌కు స్టాంపు డ్యూటీ రెండు శాతం, ట్రాన్స్‌ఫర్ డ్యూటీ 0.5 శాతం, రిజిస్ట్రేషన్ ఫీజు 0.5 శాతం ఉంది. యూజర్ ఛార్జీలు 500 రూపాయలు వసూలు చేస్తున్నారు. మార్టిగేజ్ రుణాలకు బ్యాంక్ ఇచ్చే రుణం విలువలో స్టాంపు డ్యూటీ 0.5 శాతం, రిజిస్ట్రేషన్ ఫీజు 0.1 శాతం, యూజర్ ఛార్జీలు 500 రూపాయలు వసూలు చేస్తున్నారు. ఎక్ఛేంజ్(రద్దుబదులు)కు సేల్‌డీడ్ మాదిరిగానే రిజిస్ట్రేషన్ ఫీజు వసూలు చేస్తున్నారు. ప్రస్తుతం సేల్‌డీడ్‌కు మొత్తం 7.5 శాతం ఫీజు వసూలు చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో 13 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి. ఈ కార్యలయాల్లో రోజుకు 300 నుంచి 350 వరకు రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. రిజిస్ట్రేషన్ ఫీజు కింద ప్రభుత్వానికి రోజుకు 60 లక్షల నుంచి 70 లక్షల ఆదాయం వస్తున్నది. పెరగనున్న మార్కెట్ విలువతో రెట్టింపు ఆదాయం సమకూరే అవకాశముందని అంచనా వేస్తున్నారు.

రేపు 147వ ఎన్నీల ముచ్చట్లు

కరీంనగర్ కల్చరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం 6 గంటలకు తీగలగుట్టపల్లి అమ్మ గుడి వద్ద గల మాణిక్యేశ్వరినగర్, 12వ నెం. రోడ్, వేద్రాది హెవెన్స్‌లోని డాక్టర్ వెల్మల కృష్ణారావు నివాసంలో 147వ ఎన్నీల ముచ్చట్ల సాహితీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష కార్యదర్శులు సీవీ కుమార్, దామరకుంట శంకరయ్య ఒక ప్రకటనలో తెలిపారు. కవులు, రచయితలు హాజరు కావాలని కోరారు.

మంత్రి అడ్లూరిని కలిసిన మైనార్టీ సెల్ నాయకులు

కరీంనగర్ అర్బన్, జూలై 8(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని బంజారా హిల్స్ మినిస్టర్ క్వార్టర్స్‌లో మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను మంగళవారం జిల్లా కాంగ్రెస్ మైనార్టీ సెల్ చైర్మన్ మొహమ్మద్ తాజోద్దీన్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు కలిశారు. జిల్లాలోని ముస్లిం మైనారిటీల సంక్షేమంపై చర్చించారు. పెద్దపల్లి మైనారిటీ చైర్మన్ ఎస్‌కే అక్బర్ అలీ, కాంగ్రెస్ నాయకులు నేహాల్ అహ్మద్ ఉన్నారు.

వృద్ధుల సంరక్షణ కేంద్రాన్ని పరిశీలించిన డీఎంహెచ్‌వో

సుభాష్‌నగర్, జూలై 8(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ క్వార్టర్స్‌లో గల వయోవృద్ధుల కేంద్రాన్ని మంగళవారం జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ సందర్శించారు. ఈ సందర్భంగా అందులో ఉన్న సీనియర్ సిటిజన్స్‌తో మాట్లాడారు. వారికి అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. గోదాంగడ్డలో హెల్త్ క్యాంపును సందర్శించారు.

చామనపల్లికి కమ్యూనిటీ సానిటరీ కాంప్లెక్స్ మంజూరు

కరీంనగర్ రూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం చామనపల్లికి కమ్యూనిటీ సానిటరీ కాంప్లెక్స్ మంజూరైంది. మంగళవారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి సంజీవరెడ్డి, మండల పంచాయతీ అధికారి జగన్ మోహన్‌రెడ్డి చామనపల్లిలో స్థల పరిశీలన చేశారు. అనంతరం డ్రైన్ ఎండ్ సోక్ పిట్, బోర్‌వెల్ రీచార్జ్ పిట్ నిర్మాణాలకు స్థలాలను గుర్తించారు. పంచాయతీ కార్యదర్శి కోరుకంటి మహేందర్‌రావు, ఎఫ్ఏ ఆంజనేయులు, నాయకులు గంగయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగికి ఆర్థిక సహాయం

సుభాష్‌నగర్, జూలై 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మెడికల్ కళాశాల డి సెక్షన్‌లో ఔట్‌సోర్సింగ్ అటెండర్‌గా పనిచేస్తున్న కె భరత్ తండ్రి మూడు రోజుల క్రితం మరణించాడు. భరత్‌ది నిరుపేద కుటుంబమని తెలుసుకొని తెలంగాణ మెడికల్ ప్రటర్నిటి అసోసియేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ కృష్ణారెడ్డి రూ. 9,000లను దాతల నుంచి సేకరించారు. మంగళవారం భరత్ స్వగ్రామం చామన్‌పల్లికి వెళ్లి మొత్తాన్ని అందచేశారు.

ఉపకార వేతన దరఖాస్తుల వెరిఫికేషన్ పూర్తిచేయాలి

కరీంనగర్ టౌన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల ప్రిన్సిపాల్స్ కళాశాల ఈ-పాస్ లాగిన్‌లో పెండింగ్‌లో ఉన్న యుటిలైజేషన్ సర్టిఫికెట్స్ ఫ్రెష్, రిన్యూవల్ ఉపకార వేతనాల దరఖాస్తులను వెరిఫికేషన్ పూర్తిచేసి హార్డ్ కాపీలను జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కార్యాయలంలో సమర్పించాలని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి తెలిపారు. ఫోన్ 9502664044 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఇందిరా మహిళా శక్తి సంబరాలు

చొప్పదండి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మహిళా సమాఖ్యలో ఇందిరా మహిళా శక్తి సంబరాలను అధికారులు మంగళవారం నిర్వహించారు. పెద్దకుర్మపల్లికి చెందిన అపర్ణ, రెవెల్లికి చెందిన సునన్య, భూపాలపట్నం గ్రామానికి చెందిన లావణ్యలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు సౌమ్య, ఏపీఎం నర్మద, మహిళలు పాల్గొన్నారు.

● సైదాపూర్: మండల కేంద్రంలోని మహిళా స్వశక్తి భవనంలో సంతోషిమాత మండల సమాఖ్య అధ్యక్షురాలు శ్రీలత ఆధ్వర్యంలో మహిళా స్వశక్తి సంబరాలను మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీపీఎం సుధారాణి హాజరయ్యారు.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులకు అడ్డుకట్ట

- జమ్మికుంట మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ ఆయాజ్

జమ్మికుంట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతతో సీజనల్ వ్యాధులను అరికట్టవచ్చని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ ఆయాజ్ అన్నారు. మంగళవారం జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని హరితనగర్‌లో వంద రోజుల ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా ఆయిల్ బాల్స్‌ను నిల్వ నీటిలో వేశారు. ఓపెన్ ప్లాట్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలని లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మేనేజర్ రాజిరెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహేష్, సదానందం, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

వాకర్స్, క్లబ్ ఆధ్వర్యంలో సన్మానం

హుజూరాబాద్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఇటీవల పదవీ విరమణ పొందిన డిప్యూటీ ఈఈ కట్కూరి మల్లారెడ్డిని మంగళవారం వాకర్స్ అసోసియేషన్, క్లబ్ సభ్యులు హుజూరాబాద్ పట్టణంలోని హైస్కూల్ గ్రౌండ్, క్లబ్‌లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మల్లారెడ్డిని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఏసీపీ మాధవి, వర్ధినేని రవీందర్‌రావు, బండ శ్రీనివాస్, చొల్లేటి కిషన్‌రెడ్డి, కళ్లెపు మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

వీణవంక, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోర్కల్ గ్రామానికి చెందిన నిమ్మల రాజు (40) చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిమ్మల రాజు, అతని భార్య రజిత కొంతకాలంగా అల్గునూర్‌లో కూలి పని చేసుకుంటూ జీవిస్తున్నారు. భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతుండటంతో మనస్థాపం చెందిన రాజు ఈ నెల 1న ఇంట్లో ఉన్న గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. జమ్మికుంటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ రాజు మంగళవారం మృతి చెందాడు. మృతుడి తల్లి కనకమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తిరుపతి తెలిపారు.

లలితాపూర్‌లో ఉచిత వైద్యశిబిరం

మానకొండూర్, జులై 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లలితాపూర్ గ్రామంలో మంగళవారం మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యులు కిరణ్, కరుణాకర్, మనోజ్‌కుమార్ ఉన్నారు.

రామాలయ కమిటీ సాధారణ సమావేశం

ఇల్లందకుంట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట మండల కేంద్రంలోని సీతారామచంద్రస్వామి దేవస్థానంలో ఆలయ చైర్మన్ ఇంగిలే రామారావు అధ్యక్షతన మంగళవారం సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలోని పలు అభివృద్ధి పనులపై చర్చించారు. సమావేశంలో ఆలయ ఈవో సుధాకర్, డైరెక్టర్లు, అర్చకులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలని వినతి

గన్నేరువరం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండ్లపల్లి స్టేజీ నుంచి జంగపల్లి, హనుమాజిపల్లి, మాదాపూర్, మైలారం గ్రామాల మీదుగా మండల కేంద్రానికి ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలని కోరుతూ కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్‌కు బీజేపీ మండల నాయకులు సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. డబుల్ రోడ్డు పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సొల్లు అజయ్‌వర్మ, గుంటుక శంకర్, పుల్లెల రాము తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందిస్తున్న నాయకులు